VISALAANDHRA VIJAYAWADA PHONE No. 376

4 పేజీలు 7 నయాపైసలు రిజిష్టర్డు నెం. A 203

700910

శతాధిక శ్రీ విశ్వేశ్వరయ్య

బెంగుళూరు, సెప్టెంబరు 15

డాక్టర్ విశ్వేశ్వరయ్యకు నేటితో 101 సంవత్సరాలు నిండాయి. నేటి ఉదయం ఆయన ఇంటివద్దకు రాష్ట్ర మంత్రులూ, తదితర ప్రముఖులూ వచ్చి శ్రీ విశ్వేశ్వరయ్యకు శుభాకాంక్షలు తెలిపారు

విశాలాంధ్ర

సంపుటి 11] విజయవాడ * 16 సెప్టెంబరు 1961 శనివారం * [సంచిక 262

'విశాలాంధ్ర' పత్రిక
చందా వివరాలు

	ఏజంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం	28 00	30 00
ఆరు మాసాలు	14 00	15 00
మూడు మాసాలు	7 00	7.75
ఒక మాసం	2 40	2 60

జర్మనీ తదితర సమస్యలపై రస్క్‌తో చర్చలకు గ్రోమికో సంసిద్ధత

వాషింగ్టన్‌లో పాశ్చాత్యవిదేశాంగమంత్రులసభ జరుగుతుండగా మాస్కోలో ప్రకటన

చిత్తశుద్ధి ఉంటే పరిష్కారమార్గం సాధ్యమని సోవియట్ విదేశాంగశాఖ ప్రకటన

మాస్కో, సెప్టెంబరు 15

జర్మనీ తదితర సమస్యలపై అమెరికా విదేశాంగ మంత్రి డీన్‌రస్క్‌తో కూర్చుని ఒకరి అభిప్రాయాలను ఒకరికి తెలుపుకొడానికి తాను సిద్ధంగా వున్నానని సోవియట్ విదేశాంగ మంత్రి అండ్రీ గ్రోమికో తెలియజేశారు

వాషింగ్టన్‌లో బ్రిటన్, ఫ్రాన్స్, పశ్చిమ జర్మనీ, అమెరికా విదేశాంగ మంత్రులు సంభాషణలు ప్రారంభించిన సమయంలోనే మాస్కోలో ఈ ప్రకటన వెలువడింది.

ముందు రస్క్-గ్రోమికోలు కలుసుకోవాలన్న సూచనను నిన్న అమెరికా అధ్యక్షుడు కెన్నడీ చేశారు. ఈ సూచనను బ్రిటన్ బలపర్చింది. బ్రిటన్ క్రియాశీలవైఖరిని సోవియట్ దృష్టిలో పెట్టుకున్నదనీ, రస్క్‌తో చర్చలుజరప డానికి సిద్ధంగా వున్నామనీ సోవియట్ విదేశాంగశాఖ ప్రకటించింది.

అభిప్రాయాన్ని ఇచ్చి పుచ్చుకోవడంలో ఉభయులూ చిత్తశుద్ధితో జర్మనీతో శాంతి సంధి, అది ఆధారంగా పశ్చిమ బెర్లిన్ ప్రతిపత్తి సమస్యకూ సంయుక్తంగా పరిష్కార మార్గాన్ని కనుగొనగలరనే ఆశాభావాన్ని సోవియట్ విదేశాంగ శాఖ వెలిబుచ్చింది.

రాయలసీమబావుల సబ్సిడీకి 31 లక్షల రూ॥ల మంజూరు

హైద్రాబాద్, సెప్టెంబరు 15

రాయలసీమ నాలుగు జిల్లాలలో బావుల త్రవ్వకంకోసం సబ్సిడీగా 31 లక్షల రూ.లు మంజూరుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అధికారరీత్యా ప్రభుత్వానికి క్షామ పరిస్థితులున్నట్లు రిపోర్టులు రాలేదు గాని ఇటీవల రవిన్యూబోర్డు సభ్యుడు శ్రీ ఎం. టి. రాజు రాయలసీమలో పర్యటించినప్పుడు ఉరవకొండలో ఆయన వద్దకు ప్రజలు ఆకలియాత్రగా వెళ్ళి మెమొరాండం ఇచ్చిన విషయం పాఠకులకు విదితమే.

రవిన్యూబోర్డు పునర్నిర్మాణ సమస్యను ఎన్నికల అనంతరానికి వాయిదా వేసినట్లు ఒక ప్రభుత్వ ప్రతినిధి చెప్పారు. (వి. వి.)

కొలంబో, సెప్టెంబరు 15

ప్రస్తుతం సింహళంలో అమలులో వున్న అత్యవసర పరిస్థితిని నేటినుండి మరో ఆరునెలల వరకూ పొడిగించాలని సింహళ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం గెజెటులో ప్రకటించబడింది.

నిరాయుధీకరణ
అమెరికా-సోవియట్ అధికారుల మధ్య చర్చలు

న్యూయార్కు, సెప్టెంబరు 15

నిరాయుధీకరణసంప్రతింపులను తిరిగి ఎలా ప్రారంభించాలన్న విషయమై నిన్న నాల్గోదఫా అమెరికా-సోవియట్ అధికారులమధ్య చర్చలు జరిగాయి. తిరిగి వారుఉభయులూ ఎప్పుడు సమావేశమవుతారన్న విషయమై ఏ ప్రకటనా లేదు.

పశ్చిమ దేశాలతో చర్చలకు ప్రధాని కృశ్చేవ్ సంసిద్ధత

సెప్టెంబరు 19 న 'నాటో' కూటమి మాజీ కార్యదర్శి మాస్కో సందర్శన

మాస్కో, సెప్టెంబరు 18

జర్మనీతో శాంతిసంధి కుదుర్చుకోడం ఆలస్యం కావడానికి ఉపయోగించని పక్షంలో ఏనాడైనాసరే పశ్చిమరాజ్యాలతో సంప్రతింపులు సాగించడానికి సోవియట్ ప్రభుత్వం సంసిద్ధమేనని ప్రధాని కృశ్చేవ్ ఇవ్వాళ చెప్పారు

రేపు బ్రస్సెల్స్‌లో అంతర్జాతీయ పార్లమెంటు ప్రతినిధుల మహాసభ ఆరంభమవుతుంది. దానికి ప్రధాని కృశ్చేవ్ ఒక సందేశం పంపుతూ, "జర్మనీ సమస్య శాంతియుతంగా పరిష్కారం అయ్యేందుకు సోవియట్ దేశం సకల విధాలా కృషి చేస్తుంది" అనీ, "అన్ని న్యాయమైన అభిప్రాయాలూ పరిగణలోనికి తీసుకోబడతాయనీ" చెప్పారు.

పశ్చిమదేశాలలో యుద్ధ పిపాసా లంపట వర్గాలు రష్యా చేస్తున్న శాంతి ప్రతిపాదనలను వ్యవహార సరళిలో పరిశీలించడానికి బదులు బెదిరింపులకు, కవ్వింపులకు పూనుకుంటున్నాయని చెప్పారు.

"ఈ పరిస్థితులలో సోవియట్ యూనియన్ తన భద్రతను బలపరచుకోవడం కోసం కొన్ని చర్యలు తీసుకోవక తప్పిందికాదు. కసితీర్చుకొన జూచే శక్తులు, వారిని ప్రోద్భల పరచేవారు ప్రపంచాన్ని అణుయుద్ధ మారణహోమంలో ముంచడానికి చేసే ప్రయత్నాలను నిరోధించడానికి ఇవి అవసరమయ్యాయ"న్నారు.

ఉత్తర అట్లాంటిక్ సైనికకూటమి మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుతం బెల్జియం విదేశాంగమంత్రి అయిన హెన్రీ స్పాక్‌ను సోవియట్ ప్రధాని కృశ్చేవ్ మాస్కోకు ఆహ్వానించారు. మాస్కోకు సెప్టెంబరు 19న వెళ్ళడానికి ఆయన అంగీకరించారని మాస్కో రేడియో ప్రకటించింది.

బ్రిటన్‌చే సైనిక సమీకరణ

లండన్, సెప్టెంబరు 15

బెర్లిన్ సంక్షోభంమూలంగా బ్రిటన్ పశ్చిమజర్మనీలోని తన సైనిక బలగాలను కొత్తగా నిర్మించనున్నది. ఈ విషయమై బ్రిటిష్ ప్రభుత్వం నేడు ప్రకటించింది.

సైనిక బలగానికి చెందిన ముందటి దళం నిన్ననే బెర్లిన్‌కు బయల్దేరి వెళ్ళింది. క్రిస్మస్ నాటికి రైన్‌లోని బ్రిటిష్ సైన్యపు విమాన విధ్వంసక దళాల సంఖ్య నాల్గింతలవుతుంది.

ప్రస్తుతం పశ్చిమ జర్మనీలో బ్రిటిష్ సేనల సంఖ్య ఎంతో చెప్పడానికి బ్రిటిష్ యుద్ధ కార్యాలయపు అధికారి నిరాకరించారు. సాధారణ సంఖ్య 55 వేలుఅనిమాత్రం సూచాయగా చెప్పారు.

పశ్చిమ జర్మనీ చట్ట విరుద్ధ చర్య
జెట్ విమానాలచే పశ్చిమ బెర్లిన్ సీమాతిక్రమణ

బెర్లిన్, సెప్టెంబరు 15

పశ్చిమ జర్మనీ విమాన శాఖకు చెందిన రెండు జెట్ యుద్ధవిమానాలు నిన్న పశ్చిమ బెర్లిన్‌లోని టెగెల్ విమానాశ్రయంలో దిగాయని విమానాశ్రయ అధికారి ఒకరు చెప్పారు.

తూర్పు జర్మనీ విమాన మార్గాల ద్వారా పశ్చిమ బెర్లిన్‌కు రావడానికి బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలకు మాత్రమే హక్కువుంది.

పశ్చిమ బెర్లిన్, పశ్చిమజర్మనీనుండి తూర్పు జర్మనీలో 110 మైళ్ళ దూరంలో వుంది.

"నిర్హేతుకమైన క్రూర చర్య"
తూర్పు జర్మనీ విమర్శ

బెర్లిన్, సెప్టెంబరు 15

పశ్చిమ జర్మనీకి చెందిన రెండు జెట్ యుద్ధ విమానాలు తూర్పుజర్మనీ గగనమార్గాన్ని ఉల్లంఘించి రావడం 'నిర్హేతుకమైన క్రూరచర్య'అని తూర్పు జర్మనీ ప్రజారిపబ్లిక్ ప్రభుత్వం నేటి రాత్రి ఖండించింది. ఈ రెండు విమానాలూ కూడ పనిమీదనే వచ్చిన గూఢచారి విమానాలని విమర్శించింది.

సోవియట్‌కు అడినోవర్ క్షమాపణ

బాన్, సెప్టెంబరు 14

పశ్చిమ బెర్లిన్ విమానాశ్రయం వద్ద రెండు పశ్చిమ జర్మనీ జెట్ విమానాలు 'యాదృచ్ఛికంగా' దిగినందుకు పశ్చిమ జర్మనీ ప్రభుత్వం బాన్‌లోని సోవియట్ రాయబార కార్యాలయానికి నేడు క్షమాపణ చెప్పుకున్నది. ఈ విమానాలు తమ దారితప్పి "బెర్లిన్‌లోని సోవియట్ మండలంలోకి" దిగాయని పశ్చిమజర్మనీ ప్రభుత్వం చెప్పింది.

19 ఏండ్లపౌరులంతా సైన్యంలో చేరాలి

రష్యా పౌరులకు సోవియట్ రక్షణ మంత్రిత్వశాఖ ఉత్తరువు

మాస్కో, సెప్టెంబరు 14

19 ఏండ్లు నిండిన ప్రతి ఒక్క సోవియట్ పౌరుడూ తప్పనిసరిగా సైన్యంలో చేరవలసిందిగా కోరుతూ సోవియట్ రక్షణశాఖ ఒక ఉత్తర్వు జారీచేసింది. సర్వీసు విరమించినవారు కూడా సైన్యంలో చేరాలనికూడా ఆ ఉత్తర్వులో వుంది.

గతంలో సైనిక పోరాటదళాల్లో పనిచేసి రిజర్వుగావున్న సైనికులు, నావికులు, సీనియర్ ఎన్. సి. ఓ.లు కూడా తిరిగి సర్వీసులో వున్నట్టే పరిగణింపబడతారని ఆ ఉత్తర్వులో వుంది.

ఊహాతీతమైన వినాశం
ఈ దఫా యుద్ధప్రమాదంపై సోవియట్ మార్షల్

మాస్కో, సెప్టెంబరు 18

అగ్రరాజ్యాల మధ్య ఈ దఫా యుద్ధమంటే అణ్వస్త్ర యుద్ధమేనని సోవియట్ సైనిక మార్షల్ ఆండ్రీ ఎమెరెంకో నేడు ఇక్కడ పత్రికల వారితో మాట్లాడుతూ అన్నారు.

ఎమెరెంకో, వోల్గా జలవిద్యుత్ కర్మాగార ప్రారంభోత్సవానికి హాజరై స్టాలిన్‌గ్రాడ్‌నుండి ఇప్పుడే తిరిగి వచ్చారు.

భవిష్యత్తులో జరిగే యుద్ధాలలో వాడే ఆయుధాలకు పరిమితి అంటూ ఎవ్వరూ విధించలేరని ఆయన అన్నారు.

మార్షల్ ఎమెరెంకో యింకాయిలా అన్నారు:

"ప్రథమ ప్రపంచయుద్ధం రైఫిల్సు, మరతుపాకులతో ప్రారంభమై, సాయుధ టాంకుల వినియోగంతో అంతమైంది. ద్వితీయప్రపంచయుద్ధంలో ఆయుధాలు పెద్ద ఎత్తున వినియోగించబడ్డాయి. చివరకు అణుబాంబు ప్రయోగంతో ఆయుద్ధం ముగిసింది. ఇక మూడో ప్రపంచ యుద్ధం అణ్వాయుధాలతోనే ప్రారంభమవుతుంది. ఈ రకమైన యుద్ధం ఊహాతీతమైన వినాశాన్ని తెచ్చిపెడ్తుంది. అందువల్ల సోవియట్ యూనియన్ సూచించినట్లు సమగ్ర, సంపూర్ణ నిరాయుధీకరణ ఒక్కటే నిజమైన పరిష్కార మార్గం"

మార్షల్ ఎమెరెంకో స్టాలిన్‌గ్రాడ్ వద్ద సాగిన పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన సేనానాయకుడు, ఎర్రసైన్యం గౌరవఇన్స్‌పెక్టర్ జనరల్ కూడా.

హైద్రాబాద్‌లో సైనిక అఫీసర్ల శిక్షణ కేంద్రంలో ప్రసంగిస్తున్న రక్షణమంత్రి కృష్ణమీనన్

హైద్రాబాద్ వద్ద కొత్త వైమానికుల శిక్షణ కళాశాల నిర్మాణం

15 కోట్ల రూ ఖర్చుతో, ఏర్పాటుకు ప్రతిపాదన

హైద్రాబాద్, సెప్టెంబరు 14

15 కోట్ల రూపాయల ఖర్చుతో ఇక్కడకు 20 మైళ్ళ దూరానగల దుండిగల్‌లో ఎయిర్ ఫోర్సు ట్రైనింగ్ కాలేజిని స్థాపించాలని భారత ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

ఈ కళాశాలకు అవసరమయ్యే సుమారు 11,000 ఎకరాల భూమిలో ప్రస్తుతం సర్వే జరుగుతున్నదని నేడిక్కడ విలేకరులతో ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య చెప్పారు.

సర్వే అవుతున్న యీ భూమిలో సుమారు 8,000 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వానిదనీ, యీ భూమినంతా ఉచితంగా ఆకళాశాల అవసరాల నిమిత్తం భారత ప్రభుత్వానికి ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. మిగతా 3,000 ఎకరాలు ప్రైవేటు ఆస్తులనీ, వాటిని స్వాధీనం చేసుకోవలసి వున్నదనీ, అందుకోసం సుమారు రు. 50 లక్షల ఖర్చు అవుతుందనీ అన్నారు.

దుండిగల్‌లో ఆ కళాశాలలో పనిచేసే ఆఫీసర్లు, సిబ్బంది, వారి ఏడు వేల కుటుంబాల నిమిత్తం, ఇంకా తర్ఫీదు పొందేవారికోసం ఇండ్లు కట్టాలనీ, అందుచేత అక్కడొక కొత్త పట్టణం ఏర్పాటవుతుందనీ అన్నారు

ఈ కళాశాల ఏర్పడిన తర్వాత వైమానికదళ సభ్యులకు ఉన్నత తర్ఫీదు ఇవ్వడానికి నిత్యం 8,00 విమానాలు పనిచేస్తుంటాయన్నారు.

సైనిక స్కూల్
రాష్ట్ర ప్రభుత్వంచే 26 లక్షల రూ. మంజూరు

హైద్రాబాద్, సెప్టెంబరు 15

విశాఖపట్నం జిల్లా విజయనగరంవద్ద నున్న కోరుకొండ దగ్గర ఏర్పాటు కాబోతున్న సైనిక పాఠశాలకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 26 లక్షల రూ. మంజూరుచేసింది

ఆరంభంలో యీ పాఠశాలలో 200 మందిని చేర్చుకుంటారు క్రమేపీ 500లకు పెంచుతారు. ఇందులో బాలికలను చేర్చుకోరు.

ఈ పాఠశాలకు అవసరమయ్యే భవనాలను విజయనగరం మహారాజకుమార్ సర్ విజయ దానం చేశారు. ప్రభుత్వం ఇచ్చేధనాన్ని ఇప్పటి భవనాలను బాగుచేయడానికి, కొత్తస్థలాలను కొనడానికి వినియోగిస్తారు.

ప్రతి విద్యార్థికి ఏటా 1900 రూ. ఫీజు వుంటుందని భావిస్తున్నారు.

ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు భారత ప్రభుత్వ రక్షణశాఖ అనేక స్కాలర్‌షిప్‌లు ఇస్తుందనీ, ఇందులో అత్యధికభాగం సైన్యంలో పనిచేసేవారి బిడ్డలకేననీ తెలుస్తున్నది. విద్యార్థులలో సుమారు 25 శాతానికి స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. పాఠశాలలో చేర్చుకోవడం ప్రతిభను బట్టే వుంటుంది ఒక ప్రవేశపరీక్ష వుంటుంది.

11-17 ఏండ్లు మధ్య వయసున్న బాలురను చేర్చుకుంటారు. వీరు సీనియర్ కేంబ్రిడ్జి పరీక్షకుగాని, ప్రస్తుతం రూపొందించబడుతున్న పబ్లిక్ స్కూల్ పరీక్షకుగాని కూర్చోవాలి. ప్రభుత్వం త్వరలోనే పబ్లిక్ స్కూల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్ట దలచింది దీనికీ, ఎస్. ఎస్. ఎల్. సి లేదా ప్రీయూనివర్సిటీ విధానానికీ భేదం వుంది.

ఈ పాఠశాలను సైనిక పాఠశాల అని పిలిచినా ఇందులో సైనిక వ్యవహారం ఏమీ వుండదు. పేరు నేతిబీరకాయ లాంటిదే. దీనిని కూడా దాదాపు భారతదేశంలో ఇదివరకేవున్న ఇతర పబ్లిక్ స్కూల్స్ పద్ధతిలోనే నడుపుతారు. మామూలు విద్యగాక, గుర్రపుస్వారీ, ఈత, స్కేటింగ్‌లలో శిక్షణ యిస్తారు.

ఈ పాఠశాలకు భారతదేశం అంతటినుండి విద్యార్థులు రావచ్చు ఆంధ్రప్రదేశ్ వెలుపలనుండి వచ్చే విద్యార్థులకోసం 25 శాతం సీట్లు రిజర్వుచేసి వుంచుతారు. దీనికి ప్రధమంగా ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యేవారు ఒక సైనికోద్యోగి అయివుంటాడు.

పంజాబు ప్రభుత్వ క్రూర నిర్బంధవిధానం

తీవ్రంగా ఖండిస్తూ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గ తీర్మానం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18

పంజాబు ప్రభుత్వం నేడు ఆ రాష్ట్ర ప్రజలపై సాగిస్తున్న క్రూర నిర్బంధ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ అక్కడ సమావేశమవుతున్న భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గం నేడొక తీర్మానం చేసింది

ముఖ్యమంత్రి ప్రతాప్‌సింగ్ ఖైరాన్ ఈ రకమైన ప్రమాదకరమైన ధోరణి కొనసాగించకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం కల్పించుకోవాలని ఆ తీర్మానంలో కోరారు

పంజాబులో పౌరసత్వ హక్కులు నేడు ఏమాత్రం లేకుండా ఖైరాన్ అణచివేశారని ఆతీర్మానంలో తెలిపారు.

ప్రత్యేకంగా కమ్యూనిస్టుపార్టీకి చెందిన పంజాబు పార్టీ కార్యకర్తలను, నాయకులైన హరికిషన్‌సింగ్ సూర్జిత్‌ను, సర్దార్ సోహన్‌సింగ్ జోష్‌లను అరెస్టు చేశారని తీర్మానంలో నిరసించారు.

కమ్యూనిస్టుపార్టీ మీద ఆధార రహితంగా అర్థంలేని ఆరోపణలను పంజాబు ముఖ్యమంత్రి చేస్తున్నాడనీ, ఇప్పుడా రాష్ట్రంలో సాగుతున్న అమానుషమైన, క్రూర నిర్బంధవిధానానికి నిరసనగా సభలూ, ప్రదర్శనలూ జరపాలని పార్టీశాఖ లన్నింటికీ కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గం మరో తీర్మానంచేస్తూ ప్రభుత్వ ఉద్యోగులపట్ల కేంద్రప్రభుత్వం అనుసరించుతున్న విధానానికి అసమ్మతిని తెలియజేసింది సమ్మె సందర్భంలో బర్తరఫు చేయబడిన ఉద్యోగుల కేసుల విషయమై పునఃపరిశీలించగలమని ప్రభుత్వం మాటయిచ్చి, దాని నిప్పుడు త్రోసిపుచ్చిందని విమర్శించింది.

ఐరాస చేతుల్లో కీలక ప్రాంతాలు

లియోపోల్డ్‌విల్లీ, సెప్టెంబరు 14

ఎలిజబెత్‌విల్లీలో రాత్రంతా ఐరాస సేనలకు, కటాంగా దళాలకు యుద్ధ బెదరుబోదుల పోరాటం సాగుతూనే వుందనీ, అయితే నేడు నగరంలోని కీలక ప్రాంతాలన్నీ ఐరాస సేనల స్వాధీనంలో వున్నాయనీ ఐరాస ప్రతినిధిఒకరు నేడిక్కడ ప్రకటించారు.

సోవియట్‌చే వాహక రాకెట్ ప్రయోగం

జయప్రదమైనదని 'టాస్' ప్రకటన

మాస్కో, సెప్టెంబరు 14

కేంద్ర పసిఫిక్‌మహాసముద్రంలోకి అతిశక్తివంతమైన, అనేక అంచెలుగల వాహక రాకెట్‌ను సోవియట్ యూనియన్ జయప్రదంగా నిన్న ప్రయోగించిందన్ని "టాస్" ప్రకటించింది.

ఈ రాకెట్ 7,500 మైళ్ళకుపైగా ప్రయాణం చేసింది.

ముందుగా లక్షించిన స్థలానికి ఐదున్నర ఫర్లాంగులు (ఒక కిలోమీటరు) కంటే లోపుగానే యీ రాకెట్ చివరిభాగం వెళ్ళి పడిందని "టాస్" తెలిపింది.

ఈ ప్రయోగం సెప్టెంబరు 13 న జరిగిందనీ, ముందుగా నిర్ణయించిన కాలంలోనే ఈ ప్రయోగం పూర్తయిందనీ ఆ ప్రకటనలో వుంది.

నిర్ణయించిన కార్యక్రమానికి పూర్తిగా అనుగుణంగానే ఆ రాకెట్‌లోని అన్ని అంచెలు పనిచేశాయి.

ఆ ప్రాంతంలోకి ఇలాంటి అనేక అంచెలుగల వాహక రాకెట్లను ప్రయోగించడం ఇంకా సాగుతుంది.

రష్యా అణు ప్రయోగాలు
అమెరికా ప్రకటన

వాషింగ్టన్, సెప్టెంబరు 14

సోవియట్ యూనియన్ నిన్న రెండు, ఇవ్వాళ ఒకటి అణు ప్రయోగాలు చేసిందని అమెరికా అణుశక్తి కమిషన్ ప్రకటించింది.

జలంధర్‌లో కమ్యూనిస్టుల అరెస్టు

జలంధర్, సెప్టెంబరు 18

144 వ సెక్షన్‌ను ధిక్కరించారన్న కారణంతో నేడిక్కడ ఎనిమిదిమంది కమ్యూనిస్టులను అరెస్టు చేశారు.

పౌరసత్వహక్కులను పునరుద్ధరించాలని నినాదాలిస్తూ కమ్యూనిస్టులు ఊరేగింపు జరిపారు.

పడవ ప్రమాదంలో 39 మంది మృతి

ఇండోర్, సెప్టెంబరు 18

హోషంగాబాద్ జిల్లాలోని సివనీ మాల్వార్ గ్రామానికి 40 మైళ్ళ ఎగువన నర్మదానదిలో ఒక ఫెర్రీ పడవ బోల్తా పడిందనీ కనీసం 39 మంది మునిగిపోయి వుంటారనీ నేడిక్కడ అందిన వార్తలు తెలుపుతున్నవి. పడవలో 40 మంది ప్రయాణీకులున్నారట.

మనసులేని మర్యాద

సౌకర్నో, కైటాలపట్ల కెన్నెడీ వైఖరిపై అమెరికా రేడియో వ్యాఖ్యలు

న్యూయార్కు, సెప్టెంబరు 15

అమెరికాకువచ్చిన ఇండోనేషియా, మాలీ రిపబ్లిక్ అధ్యక్షుల పట్ల అధ్యక్షుడు కెన్నడీ చూపుతున్న మర్యాద "ఏదో తప్పనిసరై చూపుతున్న మర్యాద" మినహా మరేమీకాదని అమెరికా రేడియో, టెలివిజన్ కేంద్రాలు తమ శ్రోతలకుప్రసారం చేశాయి.

ఈ ప్రసార కార్యక్రమాలు కొన్నింటిలో బెల్గ్రేడ్ తటస్థ మహాసభ ప్రకటనలను చాల తీవ్రంగా ఖండించాయి కూడా.

ఒక ప్రఖ్యాత వ్యాఖ్యాత, తటస్థ దేశాలు సైనికంగా గాని, ఆర్థికంగా గాని శక్తివంతమైనవి గావని, చివరకు వాటికి నైతికశక్తికూడాలేదనిఅన్నాడు. వాటికున్న రాజకీయ శక్తల్లా ఐరాసలోనే అని చెప్పాడు.

అంతేగాదు, "కొంతవరకు ప్రధాని నెహ్రూకూ ధర్మావేశమున్నది. కాని తటస్థదేశాల సభలో పాల్గొన్న వాళ్ళంతా ఉగ్రవాదులు. ఇదే చాలమంది అభిప్రాయమున్నూ. యుగోస్లావియా అధ్యక్షుడు టిటో వాషింగ్టన్ వైపు స్నేహహస్తాన్ని చాచాడు. మాస్కోవైపు అరమరికలు లేకుండా వున్నాడు" అని కూడా చెప్పాడు.

ప్లవనామ సంవత్సర
భాద్రపద శు॥ షష్ఠి ప 3 4
అనూరాధ రా 11 37

విశాలాంధ్ర

శనివారం 16-9 1961

కాటంగా లీనీకరణ

కాటంగాపై ఐరాస సేనల పోలీసు చర్య ప్రారంభమైంది ఐరాస సేనలకు కాటంగా సేనలకు ఎలిజబెత్‌విల్లీ నగర వీధుల్లో తీవ్రపోరాటం జరుగుతున్నది కాటంగా అంతటాకూడా పోరాటం ప్రారంభమైనట్లు, షోంబేకు అనుకూలంగా కొన్ని తెగల నాయకులు ఐరాససేనలపై దాడి ప్రారంభించినట్లు తెలుస్తున్నది.

ఉత్తర రొడీషియా పారిపోయినట్లు ఎంచబడిన షోంబే రాజధానిలోనే తలదాచుకున్నట్లు, ఐరాస ప్రతినిధితో చర్చలకు సంసిద్ధత వెలిబుచ్చినట్లు వింటున్నాం ఒకవైపున సాయుధ ప్రతిఘటన సాగిస్తూ, మరొకవైపున చర్చల ప్రస్తావన తేవడం కపట నాటకం మాత్రమే ఇలాంటి కపట, నాటకంలో షోంబే అరితేరినవ్యక్తి

ఏ పరిస్థితులలోనూ ఐరాస అధికారులు మెత్తబడక కాటంగా సేనలు సంపూర్ణంగా లొంగిపోయేటంత వరకు పోలీసు చర్యనుకొనసాగించటం అవసరం

నిజానికి ఐరాస సేనలు విద్రోహి షోంబేపై ఇలాటి చర్యను ఏనాడో తీసుకోవలసింది. 1961 ఫిబ్రవరిలో భద్రతాసమితి ఆమోదించిన తీర్మానం ఐరాస సేనలకు అట్టి అధికారాన్ని ఇచ్చిందికూడ ఐనప్పటికీ ఎనిమిది నెలలపాటు ఐరాస జాగు చేసింది

1960 జులై 1 కాంగో స్వతంత్ర ప్రభుత్వంగా అవతరించిన వారం రోజులకే షోంబే బెల్జియన్ సామ్రాజ్యవాదుల ప్రోద్బలంతో తన కపటనాటకం ప్రారంభించాడు కాటంగా కాంగోలో భాగం కాదని స్వతంత్ర ప్రభుత్వమని ప్రకటించాడు ఈ విచ్ఛిన్నకర ధోరణిని అరికట్టేందుకే అనాటి కాంగో ప్రధాని అమరవీరుడు లుముంబా ఐరాస జోక్యాన్ని అర్థించాడు, ఐరాస జోక్యమైతే చేసుకున్నదికాని, షోంబేకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు ఆ జోక్యం ఉపయోగపడలేదు

కాంగో కేంద్ర ప్రభుత్వంలో చీలికలు కల్పించి కసవూబూ, మొబుటూలను రెచ్చగొట్టి లుముంబాను నిర్బంధించి విద్రోహి షోంబే వశంచేసి, లుముంబా దారుణ హత్యకు ప్రత్యక్ష బాధ్యత వహించింది ఐరాసయే

ఐరాసయే గనుక మొదట్లోనే ఖచ్చితమైన వైఖరి అవలంబించి ఉంటే కాంగోలోని దారుణ ఘటనలు జరిగి ఉండేవేకావు ఐరాస వైఫల్యానికి కాంగో ఘటనలొక ప్రత్యక్ష తార్కాణం

కాని పాశ్చాత్య రాజ్యాలు ఐరాసద్వారా ఎల్లకాలం తమ కపటనాటకాన్ని ఆడలేకపోయాయి ప్రపంచప్రజాభిప్రాయమంతా లుముంబా దారుణహత్యకు బాధ్యులైనవారిని ఖండించింది కాంగోలో ప్రజాతంత్ర శక్తులు పుంజుకుని సమైక్య కాంగో అవతరణకు కృషి చేయసాగాయి

ఈ పరిణామాల ఫలితంగా, అదౌలా ప్రధానిగా, లుముంబా వారసుడు గిజెంగా ఉపప్రధానిగా కాంగో కేంద్రప్రభుత్వం పునర్నిర్మితమైంది సోవియట్ రష్యా ఈ ప్రభుత్వాన్ని గుర్తించింది అదౌలా, గిజెంగాలు బెల్గ్రేడ్ మహాసభకు హాజరై సమైక్య కాంగో ప్రతిపత్తిని ప్రపంచ వేదికపై ప్రతిష్ఠించారు కాటంగాపై ప్రస్తుతం జరిగిన ఐరాస సైనిక చర్యలతో, కాంగో మరొక ముందడుగు వేసింది

కాని ఇంతటితోనే కాంగో సమస్యలన్నీ పరిష్కారమైనట్లు కాదు సామ్రాజ్యవాదులు, వారి తాబేదారులు ఇప్పటికీ తమ కుట్రలు సాగిస్తూనే ఉన్నారు

కాటంగాలో ఐరాస సైనిక చర్యను ఆక్షేపిస్తూ బ్రిటిష్ విదేశాంగశాఖ ఒక ప్రకటన చేసింది బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కాంగో సమైక్యతకు విరోధులుగా ఈ చర్యతో స్పష్టంగా బైటపడ్డారు కాటంగా సేనలో ఇప్పటికీ బెల్జియన్ విదేశీయులున్నట్లు, ఐరాస సేనలపై మొట్టమొదట ఈ విదేశీయులే కాల్పులు సాగించినట్లు వారలు తెలియ జేస్తున్నాయి, డిగోల్‌కు వ్యతిరేకంగా అల్జీరియాలో సైనిక తిరుగుబాటునడిపి, విఫలులై పరారీఐన ఫ్రెంచి సేనానులు పెక్కుమంది కాటంగా సైన్యంలో ఉన్నట్లు కూడా వింటున్నాం

ఇలాంటి అంతర్జాతీయ బందిపోటు మురాల చర్యలే కాంగో కడగండ్లకు కారణం కనుక కాటంగా సేనలోని విదేశీయులందరిని తక్షణం బహిష్కరించి, కాటంగా సేనలను కాంగో సేనలలో అంతర్భాగం చేయవలసి ఉంటుంది. అదేవిధంగా లుముంబా అనుచరుడు లుండూలా సేనలనుకూడా కాంగో సేనలో లీనంచేసి ఐక్య ప్రజాతంత్ర కేంద్రసైన్యాన్ని ఏర్పాటుచేయాలి

ఇంతకాలం కపటనాటకమాడిన షోంబేపట్ల, ఏమాత్రం మెతకతనం చూపక, ఇకముందు అతడిలాంటి కుట్రలు చేసే అవకాశం లేకుండా కాంగో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం కూడా అవసరం

కొత్తగా 151 పారిశ్రామిక శిక్షణ కేంద్రాల స్థాపన

వచ్చే మూడుసంవత్సరాల కాలంలో

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14

కేంద్ర కార్మికశాఖా వృత్తిదారుల శిక్షణపథకంక్రింద, వచ్చేమూడు ఏళ్లలో 15 పారిశ్రామిక శిక్షణా కేంద్రాలను నెలకొల్పుతారు.

ద్వితీయ ప్రణాళిక ఆఖరుకు పారిశ్రామిక శిక్షణా కేంద్రాలు 167 నుండి 318 వరకు హెచ్చుతాయి వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ సంస్థలలో ప్రవేశం పొందుతున్న వారిసంఖ్య 42 వేల నుండి 1,00,000 కు పెరుగుతుంది

తృతీయ ప్రణాళికా కాలంలో సుమారు 10 లక్షలమంది వృత్తి నిపుణులు అవసరం ఈ అంశాన్ని అందరి దృష్టికి తీసుకురావడానికి సెప్టెంబరు 17 నుండి 23 వరకు జాతీయసాంకేతిక శిక్షణ వారం జరుపుతున్నారు

ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజీలలో ఎక్కువమంది గుమస్తా ఉద్యోగాలకోసం దరఖాస్తులు పెట్టేవాళ్లే కాని వృత్తి పనులకోసం దరఖాస్తులు పెట్టేవారు తక్కువ అందుచేత దేశంలో సాంకేతిక శిక్షణావకాశాలను ఎక్కువ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది ఇదిగాక పరిశ్రమలలోకూడా ప్రారంభ శిక్షణనుఏర్పాటు చేయడానికి ప్రభుత్వం యోచిస్తున్నది

వృత్తిదారుల అధ్యాపకులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రస్తుతం మూడుసంస్థలున్నాయి మరో మూడు సంస్థలను ఇప్పుడు నెలకొల్పుతారు ఇందువలన 18 వందలమంది అధ్యాపకులు తయారవుతారు.

ఫ్యాక్టరీలలో శిక్షణ ఇవ్వడానికి గాను పార్లమెంటు శాసనం చేయబోతున్నారు ఈ పద్ధతివలన ఏటా 14,000 మంది శిక్షణపొందే అవకాశం ఏర్పడుతుంది

పారిశ్రామిక కార్మికులకు ఉపసాయంత్రంక్లాసులు తర్ఫీదు ఇవ్వడానికిపెట్టిన తరగతులువిస్తృతంచేస్తారు 2 వేలనుండి 11 వేలవరకూ శిక్షణ పొందేవారి సంఖ్య పెరుగుతుంది

రైల్వేలు, తంతి తపాలా శాఖలు, రక్షణశాఖలు తమ శాఖలలోనివారికి శిక్షణ ఇవ్వడానికి చేస్తున్న ఏర్పాట్లుగాక ప్రభుత్వం వేరుగా చేసినఏర్పాట్లు కూడా అవసరానికి తగినంతమంది వృత్తి నిపుణులను తయారు చేయలేకని అధికారులు అంటున్నారు తృతీయ ప్రణాళికలో కావలసిన వృత్తిదారుల సంఖ్య 18 లక్షలవరకు ఉంటుందని అంటున్నారు

భారతదేశానికి ప. జర్మనీ రుణం

బాన్, సెప్టెంబరు 15

భారతదేశ తృతీయ ప్రణాళికా అమలు నిమిత్తం పశ్చిమజర్మనీ 4 కోట్ల 25 లక్షల డాలర్ల రుణాన్ని సహాయంగా ఇవ్వడానికి అంగీకరించింది

మార్కెట్ లైసెన్సు దార్ల అక్రమాలు

మునిసిపల్ ప్రత్యేకాధికారి వద్దకు రాయబారం

విజయవాడ, సెప్టెంబరు 18

పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీ యం ఈ లంటి వెంకటేశ్వరరావు, పెల్లంకి సుబ్బారావు, ఉప్పలపాటి రామచంద్రరాజు గార్లు నిన్న మునిసిపల్ ప్రత్యేకాధికారి శ్రీ అజిత్‌సింగ్‌వద్దకు రాయబారం వెళ్ళి, మార్కెట్ లైసెన్సుదార్లు చేస్తున్న అక్రమాలను గురించి విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు.

ఆ విజ్ఞప్తి పత్రంలో ఈ క్రింది విషయాలను తెలియజేశారు:

పట్టణంలోకి వచ్చే ప్రతి బండికి 24 గంటలకు కలిపి 12 నయాపైసలు పన్ను వసూలు చేయాలని ఉండగా ఆరు అణాలు వసూలు చేస్తున్నారు పట్టణంలోనుండా గ్రామాలకు పోయే బండ్లకు పన్ను వసూలు చేయరాదు, కాని అవి అన్యాయ వసూలు చేస్తున్నారు మునిసిపల్ మార్కెట్టు వెలుపల వీధులలో తిరిగి అమ్ముకొనేవారి దగ్గర పన్ను వసూలు చేయరాదు, కాని రోజుకు 12 నయాపైసలు చొప్పున వసూలు చేస్తున్నారు లైసెన్సుదార్లు తమ స్వంత ఖర్చులతో మార్కెట్ స్థలాన్ని పరిశుభ్రంగా అట్టిపెట్టవలసివున్నా, అలా ఉంచటంలేదు ముఖ్య కేంద్రాలలో రుసుము వివరాలు తెలియజేసేబోర్డులను పెట్టవలసి ఉండగా, ఒక్కబోర్డుకూడా పెట్టలేదు. గ్రామస్థులను, వీధులలో అమ్ముకొనేవారిని ఈ లైసెన్సుదారులక్రింద పనిచేసేవారు దౌర్జన్యం చేయటం, నిర్బంధించటం ద్వారా భయపెడుతున్నారు. వీరిపై తగు చర్యలు తీసుకోవాలి” అని తమ విజ్ఞప్తి పత్రంలో కోరారు.

ప్రత్యేకాధికారి శ్రీ అజిత్‌సింగ్ రాయబారం వెళ్ళినవారు చెప్పినవన్నీ సావధానంగా విని, లైసెన్సుదార్లు అక్రమంగా ప్రవర్తించినందుకు ఇప్పటికి రెండుసార్లు జరిమానా విధించామనీ, సాక్ష్యాధారాలతో ఏవైనా ఆరోపణలు తమకు తెలియజేసినట్లయితే తగుచర్యలు తీసుకుంటామనీ తెలియజేశారు మునిసిపల్ ఉత్తర్వులను లైసెన్సుదార్లు అతిక్రమించకుండా చూస్తామన్నారు

సత్యనారాయణపురం రైల్వే స్టేషను ఎదురుగా స్థలాన్ని సేకరించి, ఆ ప్రాంతంలో మార్కెట్ ఏర్పాటు చేయడానికి ఆలోచిస్తున్నారు

బొగ్గు దిగుమతికి అవకాశంలేదు

కేంద్రమంత్రివివరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14

బొగ్గు దిగుమతి చేసుకోవడానికి మన దేశానికి అవకాశంలేదని కేంద్ర ఉక్కు, గనులు, ఇంధనాలశాఖా మంత్రి సర్దార్ స్వర్ణసింగ్ నేడిక్కడ అన్నారు

బొగ్గు ఉత్పత్తిదారుల, వినియోగదారుల సభలో శ్రీ స్వర్ణసింగ్ మాట్లాడుతూ పైవిధంగా అన్నారు

బొగ్గు విషయంలో ప్రధానసమస్య రవాణాయేనని మంత్రి అన్నారు బొగ్గుఉత్పత్తి కొరతఏమీ లేదనీ, అందుచేత బొగ్గును దిగుమతి చేసుకోడానికి మన అరుదైన విదేశీ ధనాన్ని ఖర్చుచేయనవసరం లేదని అన్నారు.

దేశ ఆర్థికప్రగతి కార్యక్రమంలోరవాణా సదుపాయాల కొరతకూడా ఒక పురిటి నొప్పివంటిదని అన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం

సెప్టెంబరు 30, అక్టోబరు 1 వ తేదీలలో

హైదరాబాద్, సెప్టెంబరు 18

మహబూబ్‌నగర్ జిల్లా కమ్యూనిస్టు సమితిసమావేశం కొల్లాపూరుతాలూకా కొల్లాపూర్‌లో యీనెల 30 వ తేదీన మరియు అక్టోబరు ఒకటవతేదీన జరుగుతుందని శ్రీ కె గోపాలరావు వ్రాయుచున్నారు (వి వి)

మార్కెట్ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, శాఖల అధికారులతో కూడిన సభను హైదరాబాద్‌లో వ్యవసాయమంత్రి ప్రారంభోత్సవం చేశారు

చట్ట విరుద్ధంగా ఆయుధాలు కలిగి వున్నందుకు అంబాలాలోరణవీర్ సింగ్ అనే అతనికి 1,000 రూ జుమానా, రెండేండ్ల ఖైదు శిక్ష విధించారు

ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల సంఘం

హైదరాబాద్, సెప్టెంబరు 18

కాంగ్రెసు తరఫున పోటీచేయదలచిన అభ్యర్థులను ఎంచుకొనడానికి కొన్ని సాధారణ సూత్రాలను రూపొందించమని శ్రీయుతులు పల్లంరాజు, అల్లూరి, బ్రహ్మానందరెడ్డి గారలతో కూడిన ఉపసంఘాన్ని కోరుతూ నిన్న సాయంత్రం యిక్కడ సమావేశమైన ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికలసంఘం నిర్ణయించింది

ఆయా అభ్యర్థులను గురించి వివిధ సంస్థలు, వ్యక్తులు యిచ్చినసాక్ష్యాన్ని పరిశీలించడం, ఆ సాక్ష్యం ఆయా నియోజక వర్గాల యథార్థాన్ని ఎంతవరకు వ్యక్తంచేస్తున్నదీ అంచనా వేయడం ఈ ఉపసంఘం చేయవలసి వుంది

ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికల సంఘం ఇలా నిర్ణయించడం చాలా తీవ్ర స్వభావం కలిగి వున్నదని భావిస్తున్నారు. ఎందుకంటే ఆయా జిల్లాల కాంగ్రెసు కార్యవర్గాలు చేసిన సిఫారసులు అక్కడకు పరిశీలకులుగా వెళ్ళి వచ్చినవారు ఇచ్చిన నివేదికలతో చాలా సందర్భాలలో భేదిస్తున్నాయి చివరకు ప్రదేశ్ కాంగ్రెసు పంపిన ఇద్దరు పరిశీలకులైనా అన్ని సందర్భాలలోనూ ఒకేరకమైన నివేదిక ఇవ్వడం జరగలేదు. చివరకు వీరి సిఫారసులకూ, వాస్తవంగావున్న సాక్ష్యానికి అంతూ పొంతూ లేకుండా వుంది

ఈ సందర్భంలో శ్రీ సంజీవయ్య విషయం ఉదహరిస్తున్నారు. ఆయన కర్నూలుజిల్లాలో కోడుమూరు నియోజకవర్గానికి దరఖాస్తు పెట్టుకొన్నారు. కర్నూలుజిల్లా కాంగ్రెసు కార్యవర్గం ఆయన పేరునే సిఫారసు చేసింది కాని పరిశీలకులుగా వెళ్ళినవారికి దొరికిన సాక్ష్యాన్ని బట్టి ఈ నియోజకవర్గంలో ఇద్దరు పంచాయతీబోర్డు అధ్యక్షులు మాత్రమే ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరచారు, కాగా రెండుమంది అధ్యక్షులు శ్రీ రాజరత్నం అనే ఆయన్ను బలపరచారు.

ఇలాంటివి రాష్ట్రంలో ఇంకా అనేకం వున్నాయి

ఇది యిలావుండగా అఖిల భారత కాంగ్రెసు సంఘం అధ్యక్షుడు శ్రీ సంజీవరెడ్డి సూచించిన “దశవర్ష సూత్రాన్ని” పాటించాలని పట్టుపట్టి పోయినా దీనినికూడా దృష్టిలో వుంచుకొనే అభ్యర్థులను ఎన్నిక చేయాలని ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికల సంఘం భావిస్తున్నట్లు తెలుస్తుంది ఇదే నిజమైతే యీ సూత్రానికి ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య, ఉప ముఖ్యమంత్రి శ్రీ కె వి రంగారెడ్డి “బలి” కాక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది ఎందుకంటే వరుసగా పదేండ్లపాటు మంత్రులుగా వున్నది వీరే కాబట్టి

(వి వి)

కాంగ్రెసు అభ్యర్థులలో 15 శాతం స్త్రీలకు ఇవ్వాలని డిమాండ్

శ్రీమతి లక్ష్మీకాంతమ్మ ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబరు 18

కాంగ్రెసు ఎంచుకొనే అభ్యర్థులలో 15శాతం స్త్రీలకు కేటాయించాలని అఖిల భారత కాంగ్రెసు సంఘం ఇచ్చిన సలహాను ఖచ్చితంగా పాటించాలని ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ పల్లంరాజుకు, ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికల సంఘం సభ్యులకు శ్రీమతి టి లక్ష్మీకాంతమ్మ నేడొక విజ్ఞప్తి చేశారు

జనసంఘం ఎన్నికల ప్రణాళిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14

అఖిలభారత జనసంఘం ఎన్నికల ప్రణాళికను ఆ పార్టీ కేంద్రకార్యవర్గం ఆమోదించింది వారణాసిలో నవంబరు 16 వ తేదీన జరగనున్న అఖిలభారత కమిటీ సమావేశంలో దీనిని ఆమోదించవలసివుంది సరిహద్దుల రక్షణ, జాతీయైక్యత, పరిపాలనలోనిజాయితీ, సామర్థ్యం, ధరల స్థిరీకరణ, నిరుద్యోగ నివారణ, విద్యా పునర్నిర్మాణం ఈ ప్రధాన సమస్యల పరిష్కారానికి తమ ఎన్నికల ప్రణాళిక తగు మార్గాలను చూపుతుందని పార్టీ ప్రతినిధి తెలియజేశారు

ఆక్రమితకాశ్మీర్, లడక్ మొదలైన ప్రాంతాలలోనున్న విదేశీ ఆక్రమణక్రిందవున్న అన్ని భూభాగాలను సైనికచర్యద్వారా విముక్తిచేయాలని ఇందులో కోరారు భారతదేశ తటస్థ విదేశాంగ విధానాన్ని తాము బలపరుస్తున్నామనీ, అయితే యింకా వాస్తవికంగానూ, ఉద్రేకంగానూ ఉండేటట్లు తాము యత్నిస్తామనీ తెలియజేశారు ఏ సైనిక కూటమిలోను చేరకుండా అన్ని రకాల సహాయాలను భారతదేశం సేకరించుకోవాలన్నారు.

ఎన్నికల ప్రణాళికలో యింకా ఈ అంశాలున్నాయి

మనదేశంలో కూడావారి కార్యకలాపాలను సాగించుచున్న విదేశీ రాయబార కార్యాలయాల గురించి దర్యాప్తు చేసి అభ్యంతరకర కార్యకలాపాలు సాగించుచున్న వారిని బహిష్కరించాలి

కేంద్రీకృత రాజ్యాంగంగా ప్రస్తుత రాజ్యాంగచట్టాన్ని సవరించాలి అట్టడుగున ఉన్న స్థాయివరకు వికేంద్రీకరణ ఉండాలి జమ్మూ - కాశ్మీరును భారతదేశంలో అంతర్భాగం చేయాలి

మతాన్ని రాజకీయాలలోకిదూరనివ్వరాదు. మత ప్రాతిపదికపై ప్రత్యేక హక్కులు కోరకూడదు. మతం పేరుతో మెజారిటీ, మైనారిటీ విభేదాలు రేకెత్తించకూడదు ”

“బెర్లిన్‌లో మా హక్కుల్ని రక్షించుకు తీరుతాం; కాని రష్యాతో చర్చలకు సిద్ధం”

—కెన్నెడీ

వాషింగ్టన్, సెప్టెంబరు 15

తూర్పు బెర్లిన్‌లోని పశ్చిమదేశాల హక్కుల్నీ, పశ్చిమ బెర్లిన్ ప్రజల హక్కుల్నీ పశ్చిమరాజ్యాలు కాపాడుకుని తీరుతాయని అమెరికా అధ్యక్షుడు కెన్నెడీ నేడొక లాంఛనపూర్వక ప్రకటనలో బెదిరించారు ఈ సమస్యపై సోవియట్‌తో చర్చించడానికి, గౌరవప్రదమైన శాంతి రక్షణకు మార్గాలను వెదకటానికి అమెరికా ప్రభుత్వం సిద్ధంగావుందనికూడా అన్నారు

బెల్గ్రేడ్ తటస్థదేశాల మహాసభ దూతలైన సోకర్నో, కైటాలతో చర్చల అనంతరం కెన్నెడీ ఈ ప్రకటన చేశారు

కెన్నెడీ తన ప్రకటనలో యింకా యిలా అన్నారు. “బెర్లిన్‌లో పరిస్థితి ప్రమాదకరంగా వుంది పశ్చిమ రాజ్యాల ప్రయోజనాలను, పశ్చిమ బెర్లిన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని నేను స్పష్టం చేశాను అలాగే ఈ విషయాలపై సోవియట్ యూనియన్‌తో సహా ఇతర ప్రభుత్వాలతో కలిసి చర్చించడానికి మేము సిద్ధంగా వున్నామనికూడా నేను స్పష్టం చేశాను ఇదే అందరూ కోరుకునేదైతే, బలప్రయోగానికి దిగాల్సిన అవసరంలేదు శాంతియుత అభివృద్ధిని అసాధ్యంచేసే ఏకపక్ష నిర్ణయాలకు దిగకుండా వుండాలి ఇదే అన్నింటికంటే ముఖ్యం

“వచ్చేవారం మా విదేశాంగమంత్రి రస్క్ ఐరాసు సర్వసభ్య సమావేశానికి వెళ్ళి అమెరికా ప్రతినిధివర్గానికి నాయకత్వం వహించనున్నారు. సోవియట్ విదేశాంగమంత్రి గ్రోమికో కూడా అక్కడికి వస్తారని మేము అనుకొంటున్నాం సోవియట్ కు యిష్టమైతే జర్మనీ, తదితర సమస్యలపైపరస్పరయిలా చిత్తశుద్ధితో చర్చలు జరుపుకోడానికి అవకాశం లభించగలదు ఉద్రిక్తత తగ్గించేందుకు నిర్మాణాత్మక చర్యలను వెదకడానికి దౌత్యమార్గాలున్నాయి

అణుపరీక్షలు

జపాన్ లేఖకు అమెరికా సమాధానం

వాషింగ్టన్, సెప్టెంబరు 18

అణ్వస్త్ర పరీక్షల నిలుపుదల విషయమై అంతర్జాతీయ ఒప్పందాన్ని కుదుర్చుకుంటామన్నదే తన “ప్రగాఢ కాంక్ష” అని అమెరికా ప్రభుత్వం నేడు అణుపరీక్షలను తిరిగి కొనసాగించాలని తాను తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జపాన్ ప్రభుత్వం పంపిన లేఖకు సమాధానమిస్తూ చెప్పింది

సమాధాన పత్రాన్ని అమెరికా ప్రభుత్వం వాషింగ్టన్‌లోని జపాన్ రాయబారికి అందించింది ఈ పత్రంలోని వివరాలను విదేశాంగ శాఖ నేడు ప్రకటించింది

అణ్వస్త్రపరీక్షలను నిషేధిస్తున్న పకడ్బందీ అమలుచేయదగిన ఒప్పందం కుదుర్చుకోవాలనీ, ఇది చాలా అవసరమని అమెరికా ప్రభుత్వం భావిస్తోందని అనుక్రమంలో వుంది జపాన్ ప్రభుత్వం తన లేఖలో పేర్కొన్న అభిప్రాయాలతో అమెరికా ప్రభుత్వం పూర్తిగా సానుభూతితో వుందని చెప్పింది

ఆ పత్రంలో అమెరికా ప్రభుత్వం సోవియట్‌పై ఈ క్రింది ఆరోపణలు చేసింది

సోవియట్ అణు పరీక్షల కార్యక్రమం కరవేగంతో సాగిపోతోంది పైగా 100 మెగాటన్ల బాంబును తయారు చేయడం తన పరీక్షా కార్యక్రమం ఉద్దేశం అనికూడా సోవియట్ ప్రకటించింది ఈ బెదిరింపుల దృష్ట్యా, ముఖ్యమైన భద్రతా ప్రయోజనాలను దీర్ఘంగా పరిశీలించిన పిమ్మటనే అమెరికా కూడా తిరిగి అణుపరీక్షలు జరపాలని నిర్ణయించింది

సోషలిస్టుపార్టీ ఎన్నికల సన్నాహాలు

ఫైజాబాద్, సెప్టెంబరు 14

వచ్చే జనరల్ ఎన్నికలలో దేశవ్యాపితంగా 200 లోక్‌సభ స్థానాలకు, 1200 శాసనసభ స్థానాలకు పోటీ చేయాలని నిన్న ఇక్కడ సమావేశమైన సోషలిస్టు పార్టీ కేంద్ర పార్లమెంటరీ బోర్డు నిశ్చయించింది

అఖిలభారతపార్టీ గాగుర్తింపుకోసం ప్రయత్నించాలని కూడా బోర్డు నిశ్చయించింది

పార్టీ జాతీయ కమిటీ శ్రీరాజ్‌నారాయణ్ సింగ్ అధ్యక్షతననేడుసమావేశమై పసిఫిక్ మహాసముద్రంలోను, ఆఫ్రికా ఎడారులలోను యూరప్, అమెరికాల వారు అణ్వాయుధ సాధనలను పేల్చే అలవాటును ఖండించారు. “ఈ ప్రయోగాలవల్ల లాభపడేది అట్లాంటిక్, సోవియట్ ప్రాంతాల తెల్లప్రజలు కానీ యీ ప్రయోగాలవల్ల శ్వేతేతర ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుంది” అని బోర్డు తీర్మానం పేర్కొన్నది

నిరాహారదీక్ష ప్రతిపాదన విరమణ

ట్రేడ్ యూనియన్ నాయకులచే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14

కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంఘాలను ప్రభుత్వం తిరిగి గుర్తించడానికి నిర్ణయించినందున రూసా, న్యూఢిల్లీలో నిరాహారదీక్ష ప్రారంభించడానికి నిర్ణయించిన ట్రేడ్ యూనియన్ నాయకులు తమ దీక్షప్రతిపాదన విరమించడానికి నిర్ణయించారు

శ్రీ కె జి శ్రీవాస్తవా (ఎ ఐ టి యు సి), శ్రీ ఓమ్ ప్రకాశ్‌గుప్త (ఎన్ ఎఫ్ పి అండ్ టి), శ్రీ ఎస్ ఎస్ [illegible] (డబ్ల్యు. డి వర్కర్స్ యూనియన్), శ్రీ ఎన్ ఎమ్ జోషీగార్లు ఈ నిరాహారదీక్ష ప్రారంభించాలని నిర్ణయించారు.

అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ డాంగే, పార్లమెంటు సభ్యుడు ఎస్ ఎమ్ శ్రీ బెనర్జీ, శ్రీ కె జి శ్రీవాత్సవగార్లు కేంద్ర కార్మికమంత్రి శ్రీ నందాను కలుసుకొనగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలను గుర్తించడానికి నిర్ణయించినట్లు ఆయన తెలియజేశారు ఆ తరువాత ఈ నాయకులు హోంశాఖామంత్రి శ్రీ శాస్త్రినికూడా కలుసుకున్నారు

సమ్మెసందర్భంలో సస్పెండు చేయబడిన 300 మంది ఉద్యోగుల సస్పెన్షను ప్రభుత్వోద్యోగుల సంఘాలు ఇప్పుడు తీసుకోవచ్చునని కేంద్ర మంత్రులుచెప్పినట్లుగా రాయబారవర్గ సభ్యులు ఒకరు చెప్పారు

గత సంవత్సరం సమ్మె జరిగినప్పుడు కేంద్రప్రభుత్వం 85 సంఘాల, కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంఘాల సమాఖ్య గుర్తింపును ఉపసంహరించింది.

శ్రీ ఎస్ ఎమ్ బెనర్జీ నేటిరాత్రి ఒక ప్రకటన చేస్తూ ప్రభుత్వం చూపిన సద్భావానికి కృతజ్ఞత తెలియజేస్తున్నానని అన్నారు ప్రభుత్వ చర్యవలన సక్రమమైన పారిశ్రామిక సంబంధాలు ఏర్పడగలవని అన్నారు

తంతితపాలాశాఖ పనివారలజాతీయ ఫెడరేషన్, అఖిలభారత రైల్వేమెన్స్ ఫెడరేషన్, అఖిలభారత రక్షణశాఖా ఉద్యోగులసంఘం, కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్య మొదలైన సంఘాల గుర్తింపును ప్రభుత్వం లోగడ ఉపసంహరించిన విషయం విదితమే

రాజధానిలో స్టేడియం నిర్మాణం

ఈ ఏడాది 7 లక్షల రూ కేటాయింపు

హైదరాబాద్, సెప్టెంబరు 18

ఆంధ్ర రాజధానిలో ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న ఫతే మైదానంలోని స్టేడియం వచ్చే ఏడాది ఆఖరుకు పూర్తి అవుతుందని ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి విలేకరులతో చెప్పారు

గత సంవత్సరం దీనికోసం ఆరు లక్షల రూ వెచ్చించామనీ, ఈ ఏడాది మరో 7 లక్షల రూ కేటాయించామనీ అన్నారు ఇదిగాక ఇంకొక మూడు లక్షల రూ కేటాయించ దలచామన్నారు. దీనికి 35 లక్షల రూ ఖర్చు అవుతుందని అంచనా పదిలక్షల రూపాయలకై లాటరీ నడపాలనే ఆలోచన వున్నదన్నారు.

మలక్‌పేటలో కొత్తగా ఒక గుర్రపు పందాలస్థలం ఏర్పాటుకు 200 ఎకరాలసేకర అందుకు సంబంధించిన క్లెయిమ్ తీసుకుంటున్నట్లు అన్నారు దీనిని తయారుచేసి భవనాలు నిర్మించడానికి రెండేండ్లు పడుతుందనీ, అప్పుడు ప్రస్తుతం సికింద్రాబాద్‌లోవున్న పందాలను అక్కడకు మార్చుతారని అన్నారు

(వి వి)

అకాలీనాయకులపై ముఖ్యమంత్రి సర్దార్ కైరాన్ ఆరోపణలు

చండీగడ్, సెప్టెంబరు 14

పంజాబులో ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్‌సింగ్ కైరాన్ నేడు ఇద్దరు అకాలీనాయకులను పేరుపెట్టి పేర్కొని వారు “కేంద్ర ప్రభుత్వంతో పోరాడి, భారతీయ నాయకులకు హాని కలిగించే ఉద్దేశంతో” అకాలీదళ్ సన్నాహాలను గురించి అతిశయోక్తులతో కూడిన వార్తలు వ్యాపింప చేస్తున్నారని ఆరోపించారు

ఈ యిద్దరు అకాలీ నాయకులు పాకిస్తాన్‌తో సక్రమైనట్లు తనకు కొన్ని పాకిస్తాను వర్గాలద్వారా తెలిసిందనీ, వీరి కార్యకలాపాలు చాలా దేశభక్తి విరుద్ధంగా వున్నాయనీ అన్నారు

ఈ అకాలీల కార్యకలాపాలను పంజాబీయులంతా ఖండించాలని విజ్ఞప్తి చేశారు

ప్రశాంతంగావున్న అకాలీ కార్యాలయం

అమృతసర్, సెప్టెంబరు 14

అకాలీ నాయకుడు పంజాబీ సుబా కోసం నిరాహారదీక్ష బూని నేటికి 31 రోజులైంది నేడు అకాలీదళ ప్రధాన కార్యాలయం ఏమీ రాజకీయ కార్యకలాపాలులేకుండా ప్రశాంతంగానే కనిపించింది

అకాలీల అధికార ప్రతినిధి ఒకరు నేడు విలేకరులతో మాట్లాడుతూ పంజాబులో రాష్ట్రపతి పాలనను ప్రవేశ పెట్టాలన్న తమ పార్టీ డిమాండును పునరుద్ఘాటించారేగాని మరేమీ వ్యాఖ్యానించలేదు

పంజాబుమంత్రివర్గాన్ని బర్తరఫ్ చేస్తే తారాసింగ్ తన దీక్షను విరమిస్తారాఅని ప్రశ్నించగా “నేను అదేమీ చెప్పను గాని దానివల్ల రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మెరుగవుతుంది” అని అన్నారు

రాష్ట్రంలో పౌరస్వాతంత్ర్య హక్కులు ఏమీ లేవని అకాలీ కార్యాలయం నేడొక ప్రకటన చేసింది

అకాలీ తాత్కాలిక అధ్యక్షుడు సంత్ ఫతేసింగ్ నేడు అకాలీ కార్యవర్గ సమావేశం జరిపారు నిర్ణయాలు ఏమీ తీసుకోలేదు.

మాస్టర్ తారాసింగ్ ఇంకా బాలా నీరసించి పోయారనీ, ఆందోళన స్థితి హెచ్చిందని ఒక వైద్య ప్రకటన వెలువడింది

హోం మంత్రితో పాటియాలా మహారాజు చర్చలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14

కేంద్ర హోంమంత్రి శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రితో పాటియాలా మహారాజు శ్రీ యాదవీంద్రసింగ్ నేడు అరగంటసేపు పంజాబీ సుబా సమస్యపై చర్చలు సాగించారు

అంతకు పూర్వం వీరి తరఫున మాస్టర్ తారాసింగ్‌ను కలుసుకొని తిరిగి ఢిల్లీకి వచ్చిన ముగ్గురు మధ్యవర్తులతోనూ వీరు సమాలోచించారు

అంబాలాలో గురుద్వారాపై పోలీసు దాడి

అకాలీల అరెస్టు

అంబాలా, సెప్టెంబరు 15

అంబాలాలోని మంజీసాహెబ్ గురుద్వారాపై నేడు పోలీసులు దాడిచేసి అక్కడ రక్షణ పొందుతున్న కొంతమంది అకాలీలను అరెస్టుచేశారు నేరస్తుడని ప్రకటించిన అంబాలాజిల్లా అకాలీసంఘ ఉపాధ్యక్షుడు జకర్‌సింగ్ నిర్మల ఇందులో ఉన్నారు

పోలీసులు గురుద్వారాను చుట్టుముట్టి అరగంట సేపు సోదా చేశారు 20మందిని అరెస్టుచేసి కొన్ని కాగితాలను పట్టుకొని పోయారు.

పోలీసులు జరిపిన ఈ దాడికి నిరసనగా కొంతమంది సిక్కు స్త్రీలు, బాలికలు వీధులలో ప్రదర్శనం జరిపారు

అంబాలా మేజిస్ట్రేట్ 2 నెలలపాటు 144వ సెక్షన్ విధించారు

1200 ఇళ్లకు నష్టం

4 వేల కుటుంబాల నిరాశ్రయం

వరద బీభత్సం

జబల్పూరు, సెప్టెంబరు 15

ఈ మధ్య బాలఘాట్ జిల్లాలో వరదలు వచ్చిన ఫలితంగా 1200 ఇళ్లు కూలిపోయాయనీ, 4 వేల కుటుంబాలు నిరాశ్రయమయ్యాయనీ జబల్పూరు కమీషనర్ నేడు తెలియజేశారు

కనీ వినీ ఎరుగని వర్షాలవల్లనూ బాగ్, దేవ్, సాన్ అనే మూడునదులు ఏకమైపోయాయని అవి వైన్ గంగతో కలిసి బీభత్సాన్ని సృష్టించాయని ఆయన అన్నారు ఆయనవరదప్రాంతాలను పర్యటించి యిప్పుడు ఇక్కడకు వచ్చారు బారదరి చెరువు ప్రాంతంలో మొత్తం 107 అంగుళాల వర్షం కురిసిందని చెప్పారు

విశాలాంధ్ర వారోత్సవం

సంవత్సర చందాలు 31, ఆరుమాసాలవి 42 కి డబ్బు చెల్లింపు

శుక్రవారంనాడు ఆఫీసుకు చేరిన డబ్బు వివరాలు

విజయవాడ, సెప్టెంబరు 15

నేడు విశాలాంధ్ర కార్యాలయంలో సంవత్సర చందాలు 31 ఆరు మాసాల చందాలు 42 మరికొన్ని మూడు మాసాల చందాలకు డబ్బు చేరింది

వివరాలు:

గుంటూరుజిల్లా రాజనుంచి 8 చందాలు, గుంటూరునుంచి గడ్డిపాటి కోటేశ్వరరావు గారిద్వారా 6 చందాలు; పశ్చిమగోదావరిజిల్లా తణుకుబ్రాంచినుండి 12 సంవత్సరచందాలు, 7 అర్థ సంవత్సర చందాలు, మూడుమాసాల చందాలు 3 పశ్చిమ గోదావరిజిల్లా పెనుగొండ బ్రాంచినుండి రెండవదఫాగా 8 సంవత్సరచందాలు, 5 అర్థసంవత్సర చందాలు, మూడుమాసాలచందా 1 నల్లగొండజిల్లా- నల్లగొండ బ్రాంచినుండి రెండవదఫాగా 5 సంవత్సర చందాలు, 3 అర్థసంవత్సర చందాలు, కృష్ణాజిల్లా నందిగామ బ్రాంచినుండి మూడు మాసాల చందాలు 13; శ్రీకాకుళంజిల్లా చీపురుపల్లి బ్రాంచినుండి 2 అర్థ సంవత్సర చందాలు, 1 మూడు మాసాల చందా, కృష్ణాజిల్లా అవనిగడ్డ బ్రాంచి కోడూరు ప్రాంతంనుండి రెండవ దఫాగా 9 సంవత్సర చందాలు, 11అర్థ సంవత్సర చందాలు, అవనిగడ్డప్రాంతంనుండి రెండవ దఫాగా 2 సంవత్సర చందాలు, 7 అర్థ సంవత్సర చందాలు, చల్లపల్లి సెంటరునుండి 1 అర్థసంవత్సర చందా, మంగళాపురం సెంటరునుండి 7 అర్థ సంవత్సర చందాలు, కృష్ణాజిల్లా ఉప్పులూరు ప్రాంతంనుండి 12 చందాలు, గుంటూరుజిల్లా పిరన్న పాలెంలో 16 చందాలు చేర్పించి, ఏజన్సీని స్థాపించారు.

నిడుమోలు ‘విశాలాంధ్ర’ ఏజెంటు 6 నెలల మొత్తాన్ని లెక్కకట్టి దాన్ని ముందుగానే చెల్లించివేశారు

పశ్చిమరాజ్యాల విదేశాంగ మంత్రుల సమావేశం

వాషింగ్టన్, సెప్టెంబరు 14

మూడు పశ్చిమరాజ్యాల విదేశాంగ మంత్రుల ప్రథమసమావేశం నేడిక్కడ పూర్తియింది

అమెరికా ప్రతినిధివర్గ ప్రతినిధి ఒకరు విలేకరులతో మాట్లాడుతూ లావోస్, కాంగో, ప్రస్తుతబెర్లిన్ పరిస్థితులపై అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సు విదేశాంగ మంత్రులు సమాలోచించారని చెప్పారు.

వచ్చేవారంలో న్యూయార్కులో సోవియట్ విదేశాంగమంత్రి వచ్చినప్పుడు సోవియట్ ప్రభుత్వానికి అంగీకారమైతే జర్మనీ, తదితర సమస్యలపైన అమెరికా విదేశాంగమంత్రితో ఆయన తీవ్రచర్చలు సాగించడానికి అవకాశమున్నదని అధ్యక్షుడు కెన్నెడీ నేడిక్కడ చెప్పారు

బెర్లిన్ సమస్య

సోవియట్ - అమెరికా నాయకులు సంప్రతింపుల అవసరాన్ని గుర్తించారని కైటా

వాషింగ్టన్, సెప్టెంబరు 15

ప్రపంచ శాంతికి తాము బాధ్యులమని గుర్తించినందున సోవియట్, అమెరికా నాయకులు బెర్లిన్ సమస్యపై సంప్రతింపుల అవసరాన్ని గుర్తిస్తున్నారని మాలీ అధ్యక్షుడు కైటా నిన్న ఇక్కడ చెప్పారు

విదేశాలకు రహస్యాలను అందించిన మాజీ సైనికోద్యోగి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14

ప్రభుత్వరహస్యాలను విదేశాలకందించినట్లు యిచ్చిన నేరంక్రింద విచారించబడుతున్న జగ్జిత్ సింగ్‌కు జామీనుయిస్తూ పంజాబు హైకోర్టు యిచ్చిన ఉత్తర్వు చెల్లనేరదని సుప్రీంకోర్టు తీర్పుఇచ్చింది జగ్జిత్ సింగ్ సైన్యంలో క్లర్కుగా యిదివరకు పని చేస్తూ వుండేవాడు

ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య సంబంధాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14

కేంద్ర ప్రభుత్వానికి, ఆ ప్రభుత్వం క్రింద పనిచేస్తున్న ఉద్యోగులకు మధ్య వున్న సంబంధాలను క్రమబద్ధం చేయడానికి ప్రవేశపెట్టదలచిన బిల్లును వచ్చే సంవత్సరం [illegible] ప్రవేశ పెడతారని అనుకుంటున్నారు

కాటంగా పరిపాలనాధికారాలు

స్వాధీనం చేసుకొంటూ కాంగో ప్రధాని చర్యలు

లియోపోల్డ్‌విల్లీ, సెప్టెంబరు 18

కాంగో కేంద్ర ప్రభుత్వ ప్రధాని సిరిల్ అదొలా కాటంగా రాష్ట్రంలో అభ్యంతర పరిస్థితుల చట్టాన్ని అమలు జరిపారు.

కాంగో పార్లమెంటు నిర్ణయాన్ని అనుసరించి ఎగిడె బోచ్లీ దేవిడ్సన్‌ని కాటంగా రాష్ట్రంలో సర్వాధికారాలనూ నిర్వహించేందుకు అసాధారణ కమిషనర్‌గా పంపామని అదొలా పత్రికావిలేకరులకు తెలిపారు. ఆయనకు సహాయంగా మరికొంతమంది ఉద్యోగులనుకూడా పంపామన్నారు.

కాటంగా అంతరంగిక వ్యవహారాల మంత్రి అయిన మునుంగోను, ఆర్థిక మంత్రినీ, దిగువ శాసనసభ అధ్యక్షుడినీ అరెస్టు చేయవలసిందిగా బోచ్లీ దేవిడ్సన్‌కి ఉత్తరువులిచ్చామన్నారు.

పరిస్థితులు సానుకూలపడినప్పుడు రాష్ట్ర శాసనసభను తిరిగి సమావేశపరచి, కొత్త రాష్ట్ర మంత్రివర్గం ఎన్నికను జరిపించవలసిందిగా కూడా ఆయనకు ఉత్తరువులిచ్చామన్నారు.

ఈలోగా బోచ్లీదేవిడ్సనే సర్వాధికారాలను నిర్వహిస్తారు.

కాటంగా సాయుధబలాలకు అధిపతిగా కర్నల్ మోకీని నియమించామని కూడా అదొలా తెలిపారు. కాటంగా సైన్యాన్ని కాంగో కేంద్ర ప్రభుత్వ సైన్యంలో విలీనంచేసే కార్యక్రమాన్ని ప్రారంభించవలసిందిగా ఆయనకు ఉత్తరువు లిచ్చామన్నారు.

షోంబే రక్షణ విషయమై ఐరాసు హామీ ఇచ్చిందనీ, ఇప్పటికైనా అతను తన వైఖరిని మార్చుకొని సంప్రతింపులకు లియోపోల్డ్‌విల్లీ వస్తాడనే ఆశిస్తున్నామని అదొలా ఒక విలేకరి అడిగినప్రశ్నకు జవాబుచెపుతూ అన్నారు.

కాల్పులను ప్రారంభించింది విదేశీయులు

కాటంగాలోని విదేశీ కిరాయి సైనికులు, బెల్జియం రాయబారకార్యాలయ భవనం నుండి ఐరాసు సైనికులపై ముందుగా కాల్పులు జరపడంతోనేటి యుద్ధం ప్రారంభమయిందని అదొలా వివరించారు. తొలి ఐరాసు సైనికుని చంపింది వారే అన్నారు.

ఆ తరవాత షోంబే సైన్యానికి చెందిన సాయుధ శకటం ఒకటి పోస్టాఫీసువద్ద ఐరాస సైనికులపై కాల్పులు సాగించిందన్నారు. ఆ చుట్టుప్రక్కల ఇళ్ళల్లో నుండి కూడా కాల్పులు జరిగాయన్నారు.

పరిస్థితి ఇప్పుడు కుదుటబడినట్లుందన్నారు.

కాటంగా రేడియో ప్రసార కేంద్రాన్ని ఐరాసు సేనలు స్వాధీనం చేసుకోవడం కాంగో కేంద్ర ప్రభుత్వపు కోరికపైనే జరిగిందని కూడా అదొలా తెలిపారు.

భారత సైనికులపాత్ర

కాటంగా రాష్ట్రంలోని కీలక స్థానాలను స్వాధీనం చేసుకోవడంలో భారతీయ సైనికులుకూడా పాల్గొన్నారని ఐరాసు అధికారులు తెలిపారు.

ఎలిజబెత్‌విల్లీ పోస్టాఫీసువద్ద జరిగిన పోరాటంలో ఒక భారతీయ గూర్ఖా సైనికుడు చనిపోయాడు.

అంతర్యుద్ధ నివారణే లక్ష్యం

కాంగో కేంద్ర ప్రభుత్వానికీ, కాటంగా రాష్ట్ర ప్రభుత్వానికీ మధ్య అంతర్యుద్ధం! రాకుండా చేయడానికే ఈ విధంగా సైనికచర్య తీసుకొన్నామని ఐరాసు అధికారులు తెలిపారు.

ఎలిజబెత్‌విల్లీలో కర్ఫ్యూను విధిస్తున్నారు.

ఐరాస ప్రతినిధి వివరణ

ఎలిజబెత్‌విల్లీ పోస్టాఫీసు ప్రాంతంలోని కాటంగా సైనికులు ఆయుధాలు అప్పగించి లొంగిపోడానికి నిరాకరించడమే కాకుండా, ముందుగా కాల్పులను ప్రారంభించడంవల్లనే యుద్ధం ప్రారంభమయిందని, కాటంగాలోని ఐరాసు ప్రతినిధి ఓబ్రీన్ పత్రికావిలేకరులకు వివరించారు.

బెల్జియం రాయబార కార్యాలయం అక్కడికి 150 గజాల దూరంలోనే ఉందన్నారు.

ఆ రాయబార కార్యాలయంలో ఒక మరతుపాకిని అమర్చారనీ, కాటంగా సైన్యంలో ఇదివరకు ఉన్న బెల్జియం సైనికోద్యోగులు సుమారు ఇరవైమంది ఇప్పుడు ఆ భవనంలో ఉన్నారని భారతీయ సైనికోద్యోగులు తెలిపారు. ఒక భారతీయ సైనికుడు చనిపోవడమే కాకుండా, మరి ఏడుగురు గాయపడ్డారని తెలిపారు.

ఢిల్లీవర్గాల వైఖరి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18

కాటంగాలో నేడు జరిగిన పరిణామాలు ఢిల్లీలోని రాజకీయ వర్గాలకేమీ ఆశ్చర్యంకలిగించలేదు. ఇప్పటికొన్నాళ్లుగా అక్కడి పరిస్థితులు విషమిస్తూ రావడం వీరు గమనిస్తూనే ఉన్నారు. అయితే, అధికార వర్గాలకు వివరాలు తెలియకుండా ఉండటం ఈ వర్గాలకు వింతగా ఉంది.

కాటంగా ఘటనల్లో భారతీయ సైనికులు పాల్గొనడం, ప్రాణనష్టాలు జరగడం గురించి సైనికశాఖ వారిని అడుగగా 'బుధ వారం సెలవనీ, కాటంగానుండి వార్తలందే ఏర్పాట్లు తృప్తికరంగాలేవనీ, రాత్రిగాని, రేపుగాని చెబుతామనీ అన్నారు.

ఐరాస అధికారిని కలుసుకోవాలని షోంబే కోర్కె

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15

ఎలిజబెత్ విల్లీలో ఐరాసు ప్రధాన ప్రతినిధి డాక్టర్ ఓబ్రీన్‌ను కలుసుకోగోరుతున్నానని పరారీలో వున్న కాటంగా అధ్యక్షుడు షోంబే అభిప్రాయం వెలిబుచ్చాడు ఈ విషయం ఎలిజబెత్విల్లీ రేడియోద్వారా ఐరాసు సైనికాధికారవర్గ ప్రకటనవల్ల తెలియవచ్చింది.

ఎలిజబెత్విల్లీ ప్రకటనను ఆలిండియా రేడియో ఉటంకిస్తూ, షోంబేతో ఐరాసు సైనికాధికార వర్గం సంబంధాలు పెట్టుకొంటూన్నట్లు తెలియజేసింది.

కాటంగా సేనకు షోంబే నాయకత్వం?

పరారీలోవున్న కాటంగా 'అధిపతి' షోంబేయే ఎలిజబెత్విల్లీలో ఐరాసు సేనకువ్యతిరేకంగా సాగుతున్న పోరాటానికి నాయకత్వం వహిస్తున్నాడని, ఈ పోరాటంలో తన మంత్రివర్గ సభ్యులనేకమంది ఆయనతోనే వున్నారని బి. బి. సి. రేడియో ప్రకటించింది. తుదివరకూ ఐరాసు సేనలను ఎదుర్కొనవలసిందిగా షోంబే గతరాత్రి అజ్ఞాతంగావున్న "ఫ్రీ కాటంగా రేడియో" లో మాట్లాడుతూ విజ్ఞప్తి చేశాడని కూడ బి.బి.సి. చెప్పింది.

కమ్యూనిస్టుపార్టీ కార్యవర్గ సమావేశం

అంతర్జాతీయ పరిస్థితిపై చర్చలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18

ఇక్కడ సమావేశ మవుతూన్న భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గం నేడు అంతర్జాతీయ పరిస్థితులను గురించి చర్చించింది. బెర్లిన్ సమస్య, బెల్‌గ్రేడ్ సమావేశ ఫలితాలను గురించి ముఖ్యంగా సమీక్ష చేశారు.

సాయంత్రం సమావేశంలో పార్టీ ఎన్నికల ఎత్తుగడలపై చర్చ ప్రారంభించారు. ఉన్నారు.

సెప్టెంబరు 15 వ తేదీనుండి ప్రభుత్వోద్యోగుల సంఘాల గుర్తింపు కోసం ట్రేడ్ యూనియన్ నాయకులు ప్రారంభించనున్న నిరాహార దీక్షకు అండగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించాలని పార్టీ సభ్యులనూ, కార్మిక వర్గాన్నీ కోరుతూ ఒక తీర్మానం చేశారు.

సూరంపల్లి వీరులకు ప్రదేశ్ కమ్యూనిస్టు కార్యవర్గం జోహార్లు

హైదరాబాదు, సెప్టెంబరు 18

సూరంపల్లిలో మొఖాసాదారుల కాల్పులకు బలిఅయిన శ్రీయుతులు అన్నే రామారావు, బోడపాటి చినఅంజయ్య, బొడ్డ పాటిలక్ష్మయ్య గార్లకు ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుసమితికార్యవర్గం జోహారు లర్పించింది.

ప్రస్తుతం హైదరాబాదులో సమావేశమవుతూన్న ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గం ఈ దిగువ తీర్మానం చేసింది:

సూరంపల్లిలో మొఖాసాదారుల దారుణమైన దాడికీ, తుపాకి కాల్పులకు గురి అయిన అమరవీరులు శ్రీయుతులు అన్నే రామారావు, బోడపాటి చిన అంజయ్య, బొడ్డపాటి లక్ష్మయ్య గార్లకు ప్రదేశ్ కమ్యూనిస్టుసమితి కార్యవర్గం జోహార్లు అర్పిస్తున్నది.

ఆ మృతవీరుల కుటుంబాలకు హృదయపూర్వక సానుభూతిని తెలుపుతున్నది.

ఈ సందర్భంలోనే గాయపడిన వారికి కార్యవర్గం తన సానుభూతిని తెలియజేస్తున్నది.

పేదలు సాగుచేసుకుంటున్న బంజరు భూమిలో పైరును కాపాడాలనే హృదయ వేదనతో, తలవనితలంపుగా ఈ హత్యలకూ, గాయాలకూ గురి అయిన ఆ మహావీరుల త్యాగనిరతి చిరస్మరణీయమని కార్యవర్గం భావిస్తూంది.

పేదలకు బంజరు భూమిని పంచుతామని ప్రభుత్వం ఎడతెరపిలేకుండా వాగ్దానం చేస్తున్నది. కాని అనేక సంవత్సరాలుగా పేదలు సాగుచేసుకుంటున్న ఈ సూరంపల్లి బంజరులోని పైరును మొఖాసాదారులు పాడుచేయకుండా రక్షించమని పదే పదే విజ్ఞప్తులు చేసినా పట్టించుకోక నిరాకరించింది. మొఖాసాదారుల ముందు పోలీసులుకూడా నిస్సహాయత వెల్లడించడము మరీ శోచనీయంగా ఉన్నది. పేదలను బెదిరించడానికి, వారి ప్రాణాలను హరించడానికి భూస్వాములు లైసెన్సు పొందిన తుపాకులను దుర్వినియోగం చేస్తున్నట్లు గతంలో అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు సూరంపల్లిలోను, మానుకోట తాలూకా దాట్లలోను, జరిగిన ఘటనలు ఇదే రుజువు చేస్తున్నాయి.

ఈ విధంగా భూస్వాములకు ఆయుధాలు అందించే ప్రభుత్వ విధానాన్ని ఖండిస్తూ, అటువంటి లైసెన్సులను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నది.

సూరంపల్లి ఘటనలకు, ఖూనీలకు, కారకులయిన మొఖాసాదారులపై కఠిన చర్యలను తీసుకోవాలనీ, కాల్పులను సాగించిన విజయరామారావును వెనువెంటనే అరెస్టు చేయాలనీ, కార్యవర్గం కోరుతున్నది.

ఆర్థిక, సాంఘిక సామ్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు భూస్వామిక శక్తులు ఎంత ఆటంకముగ ఉన్నవీ, అటువంటి శక్తులకు అవకాశాలను ప్రభుత్వము ఎలాగ కల్పిస్తున్నదీ సూరంపల్లి ఉదాహరణగా తెలుపుతున్నది.

పేదప్రజలూ, ప్రజాస్వామిక వాదులూ, సంఘటితపడి, ఐకమత్యంతో ఇటువంటి 'అఘాయిత్యాలను అరికట్టేందుకు ఆందోళన చేయాలని కోరుతున్నది. (వి. వి.)

కటంగ పోరాటానికి తెగల సైనికుల రిక్రూట్:

షోంబేకు అనుకూలంగా

ఎలిజబెత్విల్లీ, సెప్టెంబరు 15

కాటంగాలోని ఐరాసు సేనల తరఫున పోరాడుతున్న ఐరిష్ సైనికులపై దాడిచేయడానికి వెయ్యమంది తెగల సైనికులకు ఉత్తర్వులు ఇచ్చినట్లు రాయిటర్ విలేకరి వ్రాస్తున్నాడు.

ఐరిష్ సేనలపై ముందూ వెనుకా చూడకుండా దాడిచేయవలసిందిగా ఆయాతెగ నాయకుడు తన సేనకు ఉత్తర్వ యిచ్చాడట.

కాటంగా సేనలు ఐరిష్ సేనలను చుట్టుముట్టి మోర్టార్లతో దాడి జరుపుతున్నారు. ఈ పోరాటం ఎలిజబెత్విల్లీకి వాయవ్యంగా 70 మైళ్ళలో సాగుతోంది. ఈ పోరాటంలో కనీసం అయిదుగురు ఐరిష్ సైనికులైనా చనిపోయివుంటారని అనధికార వార్తలు. ఇంతకన్నా ఎక్కువమంది చనిపోయివుంటారని ఎలిజబెత్విల్లీలో వదంతులుగా వున్నాయి.

ఎలిజబెత్విల్లీలో నిన్న ఉభయపక్షాలూ ఐరాసు సేనలూ-కాటంగా సేనలూ హోరాహోరి పోరాడుకుంటూ కనబడినవారినల్లా కాల్చసాగారు. ఇప్పటికి అటూఇటూ మొత్తం 100 మంది చనిపోయి వుంటారని అనధికార అంచనా.

ఐరాసు తన సైనికులను విమానాల ద్వారాదించుతోంది. ఐరాసు, కాటంగా సేనల మధ్య వీధి ఘర్షణ లింకా సాగుతూనేవున్నందువల్ల ఐరాసు ఈ చర్యకు పూనుకున్నది.

భారతసేనలు నిన్నటి పోరాటంలో కకావికలైపోయిన ఎలిజబెత్విల్లీ పోస్టాఫీసుకు 100 గజాల దూరంలోవున్న రెడ్‌క్రాస్ ఆస్పత్రిని దుర్భేద్యమైన కేంద్రంగా మార్చారు. ఈ కార్యనిర్వాణాలలో ఐరిష్ సాయుధ శకటాలు సాయపడ్డాయి.

కాటంగాలోని షోంబే సేనలు మోర్టార్లు, సాయుధశకటాలతో ప్రతిఘటించిన అనంతరం ఐరాసు కాటంగా ప్రభుత్వ రేడియో భవంతిని ఖాళీ చేసింది. నిన్న ఉదయం 20 మంది పోలీసుల మృతదేహాలు స్టూడియో బయటపడి వున్నాయని రెడ్ క్రాస్ అధికారులు ప్రకటించారు.

'సుశిక్షితు'లైన కాటంగా దళాలు, తెగల సైనికులు, వేలాది సంఖ్యలో ఎలిజబెత్విల్లీ వైపుగా సాగివస్తున్నారని కాటంగా ప్రభుత్వవర్గాలు ప్రచారం చేస్తున్నారు.

ఐరాసు పౌరఅధికారులు ఎలిజబెత్విల్లీ నగర శివార్లలోని తమ సైనిక శిబిరంలోనే వుంటున్నారని వార్తలు అందాయి.

కాటంగా అధ్యక్షుడనని చెప్పుకొంటున్న షోంబే అజ్ఞాతవాసంలోకి పోయాడన్న వార్తలపై కాటంగావర్గాలు వ్యాఖ్యానిస్తూ, షోంబే కాటంగా విడిచి ఎక్కడికీ పోరని చెప్పారు.

తాను ఆఖరి సైనికుడు చనిపోయేవరకూ, ఆఖరి తుపాకి గుండు అయిపోయేవరకూ పోరాడ్డం ఖాయమని షోంబే ప్రతినబూనినట్లు ఆయన పేరుతో వెలువడిన ఒక పత్రికాప్రకటనలోవుంది.

కాటంగాలో సైనిక చర్య సముచితం

భారతదేశ అభిప్రాయ ప్రకటన

న్యూఢిల్లీ సెప్టెంబరు 14

కాటంగాలో ఐరాసు తీసుకున్న చర్య అన్ని విధాలా దానిఅధికారానికి లోబడిన చర్యయే నని భారతదేశం నమ్ముతున్నదని భారత ప్రభుత్వ విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు తెలియజేశారు.

అంతర్యుద్ధాన్ని ఆపుచేయడానికి బలప్రయోగం చేయవలసి రావచ్చునని తీర్మానించడంద్వారా నేడు తీసుకున్న సైనికచర్య గురించి ఐరాసు ముందే వూహించినట్లు యీ ప్రతినిధి తెలియజేశారు.

కాటంగా పరిస్థితిపై అమెరికా ప్రకటన

వాషింగ్టన్, సెప్టెంబరు 15

కాటంగా పోరాటంలో అనేకమంది చనిపోయినందుకు విచారం తెలిబుచ్చుతూ అమెరికా ప్రభుత్వ విదేశాంగశాఖ నిన్నొక ప్రకటన చేసింది. కాంగోరిపబ్లిక్ కేంద్ర ప్రభుత్వంలో కాటంగా రాష్ట్రం నిర్మాణాత్మక పాత్ర వహించాలని విదేశాంగశాఖ ప్రకటన సూచించింది.

విదేశాంగశాఖ ప్రతినిధి యింకా యిలా అన్నారు:

"వేర్పాటుధోరణులవల్ల కాంగోలో అంతర్యుద్ధం ఏర్పడ్డందుకు అమెరికా ఆందోళన చెందుతోంది. యుద్ధ ప్రమాదాన్ని నివారించడమే కాంగోలో ఐరాసు ప్రధాన కర్తవ్యం. ఐరాసు సేనలు కాంగో కేంద్ర ప్రభుత్వం ఏర్పడ్డప్పటినుండీ దానికిసహాయకరంగా పనిచేస్తున్నాయి. పరిస్థితిపై విరుద్ధ వార్తలు వెలువడుతున్నాయి. తిరిగి ప్రశాంత పరిస్థితి ఏర్పడుతుందనే ఆశిస్తున్నాం.

37 మంది మరణం

జోహాన్స్‌బర్గ్, సెప్టెంబరు 18

కాటంగా ముఖ్యపట్టణం ఎలిజబెత్‌విల్లీలో జరిగిన సాయుధ సంఘర్షణల్లో 87 మంది చనిపోయినట్లు కాటంగా రేడియో ప్రకటించింది.

సూరంపల్లి ఘటనలు

బహిరంగ విచారణ జరిపి హంతకుల్ని శిక్షించాలి

ప్రజాపార్టీ సంయుక్త కార్యదర్శి శ్రీ భవానీ ప్రసాద్ ప్రకటన

హైదరాబాదు, సెప్టెంబరు 18

సూరంపల్లిలో రైతు, వ్యవసాయకార్మిక కార్యకర్తలపై మొఖాసాదారులు జరిపిన కాల్పులు మధ్యయుగాలనాటి, అనాగరిక చర్యలవంటివని ఖండిస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రజా పార్టీ సంయుక్త కార్యదర్శి శ్రీ భవానిప్రసాద్‌గారొక ప్రకటన చేశారు.

ఆయన పత్రికలకిచ్చిన ప్రకటనలో ఇలా అన్నారు:

"గన్నవరం సమీపంలో సూరంపల్లి గ్రామంలో కొందరు ఫ్యూడల్ భూస్వాములు మధ్యయుగాలనాటి అనాగరిక చర్యవంటి కాల్పులు జరిపి, ముగ్గురి మరణానికి కారకులయారన్న వార్త-అందులోనూ బంజరు తగాదా విషయంలో మధ్యవర్తిత్వంజరపడానికి వచ్చిన ముగ్గురి మరణానికి కారకులయారన్న వార్త మహాదారుణమూ, హృదయవిదారకమునూ.

"దోషి తనదికాని తుపాకీతో ఈ కాల్పులు జరిపాడనికూడా తెలిసింది. ఇది చాల తీవ్రమయిన నేరం.

"బహిరంగవిచారణజరిపి ఈదారుణ నేరానికి కారకులయినవారిని కఠినంగా శిక్షించడం ప్రభుత్వ కర్తవ్యం."

పోలీసు రిపోర్టులవల్ల ఉద్యోగాలుకోల్పోయిన ఉపాధ్యాయులు

కలకత్తా, సెప్టెంబరు 18

పోలీసుల వ్యతిరేకంగా రిపోర్టులు పంపిన కారణంగా పశ్చిమబెంగాల్‌లో 17 మంది సెకండరీస్కూలు ఉపాధ్యాయులకు గత రెండు సంవత్సరాలలో ఉద్యోగాలు పోయాయని నేడు ఆ రాష్ట్ర శాసనసభలో విద్యా మంత్రి శ్రీ రాయ్ హరేంద్రనాద్‌చౌధురి తెలియజేశారు.

కమ్యూనిస్టు సభ్యుడు డాక్టర్ రణేన్ సేన్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా అలా ఉద్యోగాలు పోయిన ఉపాధ్యాయుల పేర్లను మంత్రి చదివి వినిపించారు. అందులో యిద్దరు స్త్రీలు కూడా వున్నారు.

పోర్టు ట్రస్టులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18

ప్రధాన ఓడరేవులైన విశాఖ పట్టణం, కొచ్చిన్, కాండ్లలో "పోర్టు ట్రస్టు"లను నెలకొల్పేందుకు శాసనాలను తీసుకొనివచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలను తీసుకొంటున్నది.

రాష్ట్రంలోని మైనర్ ఓడరేవులకు ఒక "పోర్టు ట్రస్టు"ను నెలకొల్పేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అమెరికా "యాంత్రిక రోదసీ యాత్రికుడు"

ఒకసారి భూప్రదక్షిణంచేసి సముద్రంమీదికి దిగిన వైనం

కేప్‌కనవెరాల్, సెప్టెంబరు 18

అమెరికా నేడొక "యాంత్రిక రోదసీ యాత్రికుడి"ని అంతరిక్షంలోకి పంపింది అది ఒకసారి భూప్రదక్షిణంచేసి, అట్లాంటిక్ మహాసముద్రంలో కిందికి వచ్చింది.

"యాంత్రిక రోదసీయాత్రికుడు"న్న నౌకను అమెరికా నావలు సముద్రంలో నుండి తీశాయి.

మానవుని రోదసీయానానికి పంపడం విషయంలో ఇది మొదటి ప్రయోగదశ అని అమెరికా అధికారులు అంటున్నారు. రోదసీయానంలో మానవ శరీరంపై కలిగే ప్రభావాలను గ్రహించడానికి తగిన శాస్త్రపరికరాలను ఈ "యాంత్రిక యాత్రికుని"లో అమర్చారు.

ఈ ప్రయోగం తరవాత ఒక చింపాంజీని అంతరిక్షంలోకి పంపి, మూడుసార్లు భూప్రదక్షిణం చేయించి తరువాత కిందికి దింపుతారట.

నేటి "యాంత్రిక యాత్రికు"డు 106 నిమిషాలు భూప్రదక్షిణం చేశాడనీ, ఇది ముందుగా నిర్ణయించుకొన్నదానికన్నా నాలుగు నిమిషాలు తక్కువనీ అధికారులు తెలిపారు.

జానోస్ కాదర్ హంగరీ ప్రధాన మంత్రిగా నియామకం

వియన్నా, సెప్టెంబరు 18

హంగరీ రిపబ్లిక్ ప్రధాన మంత్రిగా జానోస్ కాదర్ నియమితులైనారు. ఇంతవరకు ఈ పదవిలోవున్న డాక్టర్ మ్యూనిక్ హోంమంత్రిగా నియమింపబడ్డారు.

జానోస్ కాదర్ హంగరీ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కూడా. జానోస్ పీటర్ నూతన విదేశాంగ మంత్రిగా నియమితులైనారు.

కుట్టిపురం ఎన్నికలలో కాంగ్రెసు వైఖరి

కమ్యూనిస్టుపార్టీ విమర్శ

తిరువనంతపురం, సెప్టెంబరు 18

కుట్టిపురం ఉపఎన్నికలో శ్రీ కున్హి మహమ్మద్‌కు వోటు చేయరాదని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నిన్న ప్రకటించడంతో కాంగ్రెసు నాటకం కాస్తా బయటపడిందని తెలుపుతూ కేరళ కమ్యూనిస్టు సమితి కార్యదర్శివర్గం నేడొక ప్రకటన చేసింది.

ఆ ప్రకటనలో యిలా వుంది:

ఇప్పుడు కుట్టిపురం ఉప ఎన్నికలో ప్రధానమైన పోటీ ముస్లింలీగు అభ్యర్థికీ, కున్హి మహమ్మద్‌కు మధ్యనే అని తేలినప్పుడు, కాంగ్రెసుచేసిన నిర్ణయ ఫలితం ఏమవుతుంది? ముస్లింలీగ్ గెలవాలని వాంఛించుతున్నట్లు అర్థం కావడం లేదా?

అయితే, కాంగ్రెసు కపటనాటకాన్ని ఓడించేందుకు కుట్టిపురంలోని వోటర్లు, కేరళ ప్రజలు, ముఖ్యంగా కాంగ్రెసు వారు ప్రయత్నించగలరని కమ్యూనిస్టు పార్టీ ఆశించుతోంది.

అస్సాం భాషా సమస్యపై అల్లర్లు జరిగినప్పుడు తమ బాధ్యతలను విస్మరించిన నేరాలపై 8 మంది ఉద్యోగులను శిక్షించారు.

మూల వేతనంతో అధికధరల అలవెన్సు కలిపివేత

ఈనెలాఖరులోగా నిర్ణయం ప్రకటిస్తామని శ్రీ బ్రహ్మానందరెడ్డి

హైదరాబాదు, సెప్టెంబరు 18

అధికధరల అలవెన్సును మూలవేతనంలో కలిపివేయడంగురించీ తత్ఫలితంగా వేతనాల వ్యవస్థలో చేయవలసిన మార్పులగురించీ, ఈ నెలాఖరులోగానే ప్రభుత్వ ప్రకటన వెలువడ గలదని రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు నేడు పత్రికలవారికి తెలియజేశారు.

మూలవేతనాలతో అధికధరల అలవెన్సుని విలీనంచేయడం ప్రభుత్వోద్యోగులకు మాత్రమే కాకుండా, స్థానిక సంస్థల ఉద్యోగులకు కూడా వర్తిస్తుందని ఆయన తెలిపారు.

మూలవేతనంలో అధికధరల అలవెన్సును కలిపివేయడం గురించి కేంద్ర వేతనాలసంఘ సిఫారసులనూ, మద్రాసు, మైసూరు ప్రభుత్వాలు అనుసరించిన పద్ధతులనూ ప్రదేశ్ ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఆయన అన్నారు. కొద్ది మార్పులతో మద్రాసుపద్ధతినే ఇక్కడ కూడా అనుసరించవచ్చునని ఆయన సూచించారు. అయితే ఇంకా ఏదీ నిర్ణయంకాలేదన్నారు.

నాగార్జునసాగర్ కు రు $25\frac{1}{2}$ కోట్ల అప్పు

అమెరికానుండి లభించనున్నదని అధికారప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18

అమెరికా ప్రభుత్వంతో భారత ప్రభుత్వం చేసుకొన్న ఒడంబడిక ననుసరించి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఇరవైఅయిదున్నర కోట్ల రూపాయలు రుణం లభించుతుంది.

చంబల్, నాగార్జునసాగర్, కోసి, భద్ర, తుంగభద్ర నదీలోయ ప్రాజెక్టులకోసం మొత్తం 45 కోట్ల రూపాయలు రుణం యివ్వడానికి అమెరికా ఈ ఒడంబడిక ననుసరించి అంగీకరించింది.

అమెరికా ఇండియాకు సరఫరా చేసే వ్యావసాయిక సరకులవలన లభ్యమయ్యే డబ్బుద్వారా ఈ రుణం యివ్వబడుతుంది.

ఈ రుణంలో చంబల్‌కు 14 కోట్ల 10 లక్షలు, నాగార్జునసాగర్‌కు 25 కోట్ల 50 లక్షలు, కోసికి 9 కోట్ల 20 లక్షలు, భద్రకు ఒక కోటి 50 లక్షలు, తుంగభద్రకు 8 కోట్లు 60 లక్షలు కేటాయించారు.

బొగ్గు ఉత్పత్తి తగ్గింపుకు నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18

రవాణాసౌకర్యాలు సంతృప్తికరంగా లేనందున నెలకు మూడు నాలుగు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని తగ్గించవలసివస్తున్నది.

ఇలాంటి శోచనీయమయిన చర్యను తీసుకోవలసి వస్తున్నదని నేడు ఉక్కు, గనులు, ఇంధనాలశాఖ మంత్రి సర్దార్ స్వరణ్‌సింగ్ బొగ్గు ఉత్పత్తిదారుల సమావేశంలో తెలియజేశారు.

ప్రభుత్వోద్యోగుల సంఘాల గుర్తింపు పునరుద్ధరణ

ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18

గత సంవత్సరం సమ్మెజరిగిన కారణంగా ఉపసంహరించబడిన ప్రభుత్వోద్యోగుల సంఘాల గుర్తింపు త్వరలో తిరిగి పునరుద్ధరించబడుతుంది

ఈ విషయమై ప్రభుత్వం నేడు ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకున్నది.

బోనస్ కమిషన్ విచారించవలసిన అంశాల్లో పబ్లిక్ రంగంలోని సంస్థలను కూడా యిప్పుడు ప్రభుత్వం చేర్చింది. పబ్లిక్ రంగానికి సంబంధించిన సంస్థల్లోని కార్మికులు యిప్పుడు కమిషన్ ముందు తమ డిమాండ్లను వుంచవచ్చు.

ప్రభుత్వ వాగ్దానాలపై శ్రీ డాంగే ప్రకటన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18

గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె జరిగిన సందర్భంలో ఉద్యోగులసంఘాల గుర్తింపును ప్రభుత్వం ఉపసంహరించింది. గుర్తింపును పునరుద్ధరించడంలో ప్రభుత్వ జాప్యానికి నిరసనగా ఈ అఖిల భారత రక్షణ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. యమ్. జోషి, సహాయ కార్యదర్శి శ్రీ కె. జి. శ్రీవాత్సవాలు కాలనిర్ణయం లేకుండా నిరాహారదీక్షను పూనడానికి నిశ్చయించుకొన్నారని నేడు అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. ఏ. డాంగే ప్రకటించారు.

వారితోపాటు తంతి తపాలా ఉద్యోగాల జాతీయ ఫెడరేషన్ నాయకుడు శ్రీ గుప్తా, పి. డబ్ల్యు. డి. వర్కర్స్ యూనియన్ నాయకుడు శ్రీ యస్.యస్. మన్నా, పూనాలోని రక్షణ ఉద్యోగుల నాయకుడు శ్రీ గోపాలన్‌లు కూడా నిరాహార దీక్షను సాగిస్తారు..

శ్రీ డాంగే తన ప్రకటనలో ఇలా అన్నారు:

"ప్రభుత్వోద్యోగుల సంఘాల గుర్తింపును ఉపసంహరించి యిప్పటికి ఒక సంవత్సరం అయింది. ఈ సమస్యను "త్వరలోనే" నిర్ణయిస్తామని ప్రభుత్వ ప్రకటనలు తెలుపుతున్నాయి. ఇలాంటి వాగ్దానాలను చాలమాసాలుగా వింటున్నాం. ప్రభుత్వ నిఘంటువులో "త్వరగా" అనే పదానికి నిర్వచనం ఏమిటో ఎవరికీ తెలియదు.

ఒకవేళ గుర్తింపును పునరుద్ధరించడమే జరిగితే కొన్ని షరతులపై అది జరుగుతుందని తెలుస్తున్నది. సమ్మెలను ఎన్నటికీ చేయమని ఉద్యోగుల సంఘాలు ప్రభుత్వానికి హామీ యివ్వాలట. సమ్మెకు నాయకత్వంవహించిన కారణంగా బర్తరఫ్ చేయబడిన ఉద్యోగులను యూనియన్ల నాయకత్వంలోకి తీసుకోరాదట. ఈషరతులకు అంగీకరించే యూనియన్లను మాత్రమే ప్రభుత్వం గుర్తించవచ్చు,

జపాన్ ప్రధాని భారతసందర్శన

నవంబరు 20 వ తేదీన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18.

జపాన్ ప్రధానమంత్రి హయాటో ఇకెడా నవంబరు 20వ తేదీన ఢిల్లీకి వచ్చి నాలుగురోజులపాటు వుంటారు.

కాటంగా సేనలకు తెల్లవాళ్ళ సారథ్యం

లియోపోల్డ్‌విల్లీ, సెప్టెంబరు 18

యూరోపియన్ సైనికాధికారుల నాయకత్వాన కాటంగా దళాలు గత రాత్రి ఎలిజబెత్‌విల్లీలోని పోస్టాఫీసుపై దాడులు చేశారు.

కేసరపల్లిగోభూమికొనడంలో తాశీల్దారు వెంకట్రావు పాత్ర

ఆయన్ని గన్నవరానికి బదిలీ చేయడంవల్ల తగాదా పెరుగుతుందని భయాందోళనలు

గన్నవరం, సెప్టెంబరు 12

విజయవాడ వాస్తవ్యులైన శ్రీదోనెపూడి ఈశ్వర వెంకటేశ్వర్లు వగైరాలు కేసరపల్లి గోభూమిని కొనుగోలు చేయడంలో గన్నవరం తాశీల్దారుగా పని చేసిన శ్రీ వెంకట్రావు ప్రధాన కారకులనీ, అందులో పదెకరాలు వీరికి ఉచితంగా యిచ్చే ఏర్పాటు జరిగిందనీ ఇక్కడ వదంతిగా ఉన్నది.

శ్రీ ఈశ్వర వెంకటేశ్వర్లు వగైరాలకూ, తాశీల్దారుశ్రీ వెంకట్రావుకూచాల కాలంనుంచి సన్నిహిత సంబంధమున్న సంగతీ, మైనింగు మొదలైన వ్యాపారాల్లో బినామీవాటా ఉన్న సంగతీ విజయవాడలో చాలమందికి తెలిసిన విషయమే.

శ్రీ వెంకట్రావు ఇక్కడ తాశీల్దారుగానున్నప్పుడే ఈగోభూమిని గురించిన వ్యవహారాలన్నీ పూర్తయి ఎగ్రిమెంటు వ్రాసుకున్నట్టు తెలుస్తోంది. ఇంతలో శ్రీ వెంకట్రావు ఇక్కడనుంచి అవనిగడ్డకు బదిలీ అయ్యారు. దానిమీద శ్రీ వెంకటేశ్వర్లు వర్గంవారు హైద్రాబాదులో మకాంపెట్టి ఆయన్ను తిరిగి గన్నవరం బదిలీ చేయించారు. రేపో మాపో ఆయన ఛార్జి తీసుకోబోతున్నారు.

శ్రీ వెంకట్రావు ఇక్కడకు తాశీల్దారుగా వస్తే ఈ గోభూమి విషయంలో చాలా [illegible] జరుగుతుందనీ, తగాదాలు పెరిగి పరిస్థితి తీవ్రరూపం ధరిస్తుందనీ వదంతిగా వున్నది. (వి. వి.)

తటస్థ దేశాల లేఖకు కెన్నెడీ జవాబు

వాషింగ్టన్, సెప్టెంబరు 18

బెర్లిన్ సమస్య శాంతియుత పరిష్కారాన్నే తన ప్రభుత్వం కోరుతున్నదనీ, అయితే "అణుయుద్ధం బెదిరింపులకు లొంగిపోదలచుకోలేద"నీ అమెరికా అధ్యక్షుడు కెన్నెడీ, తటస్థదేశాల విజ్ఞప్తిని తనకు అందజేసిన నెహ్రూ, కైటాలకు జవాబు చెప్పారని నమ్మకమయిన వారివలన నేడు తెలియవచ్చింది. ఈ జవాబును కెన్నెడీ వారా అందజేశారట

అణు యుద్ధం రాకుండా చేయడానికి, అమెరికా అవలంబిస్తున్న వైఖరే ఎక్కువ అవకాశం ఇస్తుందని కెన్నెడీ ఆ ఇద్దరికీ నచ్చచెప్పడానికి ప్రయత్నించారట.

ప్రస్తుత పరిస్థితిలో"తానూ, క్రుశ్చేవ్ కలుసుకోవడంవల్లప్రయోజనముంటుంద''ని భావనుకోవడంలేదని కెన్నెడీ అన్నారని తెలుస్తోంది. అంతకన్నా తక్కువ-స్థాయిలో సంప్రతింపులు అవసరంగా జరిగితే, అప్పుడే ఈ సమావేశాన్ని తలపెట్టవచ్చునన్నారట.

పంజాబ్ కర్నాలు జిల్లాలోని పట్టి కళ్యాణలో గాంధీ స్మారకనిధి సంఘం వారు సెప్టెంబరు 15 నుండి మూడు రోజులు సమావేశమౌతారు.

రేడియో

అదివారం, సెప్టెంబరు 17
శక 1883 భాద్రపద 26

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 సుభోదయం; 6-35 భక్తిరంజని; 6-55 ప్రసార విశేషాలు; 7-0 తె. వా, 7-15 అమరవాణి (హై. బి); 7-30 త్యాగరాజ స్మృతిసమారోహం: ఎస్. పినాకపాణి; 7-45 సంగీత శిక్షణ; 8-0 ఆం. వా; 8-15 హిం. వా; 8-30 పాలవెల్లి, 9-0 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 ముత్తులక్ష్మి మహాదేవన్; 1-0 అలీ అక్బర్‌ఖాన్: సరోద్; 1-30 లలితసంగీతం; 1-50 తె. వా; 2-0 ప్రసార సమాప్తి.

(ప్రత్యేక ప్రసారము)

3-0 కృతిశేషులు (నాటిక) రచన: వి. హెచ్. రాధాకృష్ణ, సమర్పణ: నవ్యకళామండలి; 4-30 ప్రసార సమాప్తి

సాయంత్రము: 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాం. వా; 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 కల్యలత-శ్రోతలుకోరిన పాటలు; 8-0 ద్వారం భావనారాయణ రావు, ఎస్. వి. హెచ్. కృష్ణమాచార్యులు: వయొలిన్, ఎల్లా సోమన్న: మృదంగం; 9-0 ఆం.వా; 9-15 లలిత సంగీతం: ఎమ్. వి. సాగరాజు, 9-45 వాద్యసంగీతం; 10-0 ముత్తులక్ష్మి మహాదేవన్; 10-30 ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - ఎ.

405.4 మీ. (740 కిలోసై.)

ఉదయం: 6-30 సుప్రభాత్; 6-35 భక్తిరంజని, 6-55 కార్యక్రమ వివరణ; 7-0 తె. వా; 7-15 అమరవాణి; 7-30 కమాల్‌సింగ్. తుమ్రి, భైరవి; 7-45 సంగీత శిక్షణ, 8-0 ఆం. వా; 8-15 హిం వా; 8-30 ఇండియన్ మార్చ్‌ట్యూన్స్; 8-35 యుద్ధ సంగీత్; 8-45 పిల్లలపాటలు 9-0 'బచ్చోంకేలియే'; 9-30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 చిత్రజగత్, 1-0 రంగవల్లి-స్త్రీలకు; 1-45 వివిధ సంగీతం, 1-50 తె. వా; 2-0 ప్రాంతీక్ లోక్ సంగీత్; 2-10 ఉ. వా; 2-20 బాలవినోదం; 3-0 కృతిశేషులు (నాటిక) (వి. బి); 4-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాంతీయవార్తలు; 6-15 నగరవాణి; 7-0 తె.వా; 7-15 కన్నడ శ్రోతలకు, 7-30 నాటిక (ఉర్దూ), 8-0 చిత్రసీమ; 8-30 కమల్‌సింగ్: తుమ్రి; 8-45 శంకరరావు: సితార్; 9-0 ఆం.వా; 9-15 ఉ. వా. 9-45 కమల్‌సింగ్: తుమ్రి; 10-0 జంత్ర వాద్యసమ్మేళనం: నిలయ విద్వాంసులు; 10-30 ప్రసార సమాప్తి.

హైద్రాబాద్ - బి

49 02 మీ (6120 కిలోసై)

ఉదయం: 6-30 హై. ఎ. వలె; 6-45 త. చంద్రమౌళి, మూర్తి వేణు రాజు: వయొలిన్, వి. ఎస్. లక్ష్మీనారాయణన్: మృదంగం; 9-30 ప్రసార సమాప్తి.

40.02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నం: 12-30 హై. ఎ. వలె; 2-10 శాస్త్రీయ సంగీతం - కె. వి. నారాయణస్వామి; 2-30 హై. ఎ. వలె, 4-0 ప్రసార సమాప్తి.

60.12మీ (4990 కిలోసై)

సాయంత్రం: 6-0 హై. ఎ. వలె; 6-15 గ్రామస్థులకు; 7-0 తె. వా, 7-15 గ్రామస్థులకు; 7-30 త చంద్రమౌళి; 8-0 హై. ఎ వలె; 9-15 రాగలక్షణం: ధనప్రియ, 9-30 హై.ఎ. వలె; 10-30 ప్రసార సమాప్తి.

మద్రాస్ - బి

311.3 మీ (1420 కిలోసై)

ఉదయం: 6-45 మంగళగానం; 7-0 తె. వా; 7-15 సంగీతమంజరి, 7-30 మ. ఎ. వలె; 8-0 ఆం. వా, 8-15 మ. ఎ వలె; 9-15 ప్రసార సమాప్తి.

311.3 మీ (1420 కిలోసై)

మధ్యాహ్నం: 10-45 ఆటవిడుపు 11-30 కలరంగం - మలయాళమున కార్యక్రమము; 12-0 హాయామె - కన్నడ కార్యక్రమం, 12-30 'సూర్య కాంతి' (తి. రి); 1-0 వాద్యగోష్ఠి; 1-30 ఆం. వా; 1-40 తేవారం; 1-50 తె. వా; 2-0 మధురగీతం; 2-10 'పాపామలర్' పిల్లలకు (తమిళము); 3-0 వి కృష్ణమూర్తి, చిత్తూర్ గోపాలకృష్ణన్: వయొలిన్, మద్రాస్ ఎ. కణ్ణన్: మృదంగం, 4-0 ప్రసార సమాప్తి.

311.3 మీ (1420 కిలోసై)

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం; 5-50 స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం); 6-0 ఆం. వా; 6-15 కార్యక్రమ వివరణ (తమిళం); 6-20 కదంబం, 7-0 తె. వా; 7-15 వాద్యగోష్ఠి; 7-30 పులవర్ వీరపాండియన్ ఉపన్యాసము (తమిళము) రఘుపతి; 8-30 మ. ఎ. వలె; 9-0 ఆం. వా; 9-45 మధుర గీతం; 10-0 సంగీతామృతం; 10-30 ప్రసార సమాప్తి.

సవరణ

ది 25-9-61 తేదీ "సాయంత్రం 4-30 గంటలకు హాజరైన టెండరు దార్ల సమక్షమున తెరువబడును అను" బదులు 4 గంటలకు అని ది 12-9-61 పత్రికలో ప్రకటించబడెను.

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు
గ్రామ పంచాయతీ, ఎలమర్రు.



No Licence needed
American model
50 SHOT REVOLVER

మిమ్ములను మీరు దొంగల నుండి మరియు క్రూరమృగములనుండి రక్షించుకొనుటకు విహారములకు, ప్రయాణములకు, నాటకములకు ఉపయోగపడును ఆటోమాటిక్‌గా 6 సార్లు ప్రేలును తేలికగలిగి, మిరుమిట్లు గొల్పు ప్రేలుడుతో మిమ్ములను అపాయముల నుండి కాపాడును

ధర:	నెం. 777	888
	రు. 8/-	10/-

50 రౌండ్ల ఆటోమాటిక్ రివాల్వర్ నెం. 999 రు15/-. 25 రౌండ్లుఉచితం. అదనంగా 100 రౌండ్లు రు 5/- తోలుసంచి రు. 6/- పోస్టేజి రు 2/-

జాపనీస్ ఏజెన్సీ
అస్వాని హౌస్. కవాస్‌జీపటేల్ స్ట్రీట్. బొంబాయి - 1

సూరంపల్లి కాల్పులు హృదయ విదారకం

విచారణ జరిపి హంతకులను శిక్షించాలని స్వతంత్ర పార్టీ నాయకుల ప్రకటనలు

మాధవరం, సెప్టెంబరు 14

కృష్ణాజిల్లా సూరంపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మికసంఘ కార్యకర్తలపైన మొఖాసాదార్లు కాల్పులు జరిపి ముగ్గురిని హత్యచేయడం హృదయవిదారకం, పరమదారుణమైన ఘాతుక చర్య అని పశ్చిమగోదావరిజిల్లా స్వతంత్రపార్టీ కార్యదర్శి శ్రీ ప్రత్తి శేషయ్యగా రొక ప్రకటనలో స్పష్టం చేశారు

శ్రీ శేషయ్యగారి ప్రకటనలో ఇలా ఉన్నది:

సూరంపల్లి గ్రామంలో మొఖాసాదార్లు వ్యవసాయ కార్మికసంఘ కార్యకర్తలపైన, బంజరు సాగుదార్లపైన జరిపిన ఘోరాతిఘోరమైన కాల్పుల్లో ముగ్గురు మరణించడం, అనేకమందికి గాయాలు తగలడం హృదయ విదారకమైన విషయం.

ఇటువంటి మహా దారుణమైన హత్యాకాండను చేసిన మొఖాసాదార్ల చర్యలను రాజకీయ విచక్షణ లేకుండా యావత్తు ఆంధ్రప్రజలూ తీవ్రంగా నిరసించవలసి ఉన్నది.

ఈ ఘాతుక చర్యలను నిర్వహించిన మొఖాసాదార్లను అరెస్టుచేసి, వారిపై కేసులు పెట్టి విచారణ జరిపించ వలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది.

చిరకాలమునుండీ సాగుచేసుకొంటున్న గ్రామబంజరు సాగుదార్లకు భూ రక్షణ కల్పించి, హంతకులకు తగిన విధంగా శిక్షించేందుకు న్యాయ విచారణ జరిపించ వలసినదిగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మృతుల ఆత్మకు శాంతి కలుగుగాక."

నూజివీడుతాలూకాస్వతంత్ర పార్టీ అధ్యక్షుని ఖండన

ఈ ఘోరమైనచర్య బ్రిటిషు పరిపాలనాకాలంలోనిజలియన్ వాలాబాగ్ కాల్పులను గుర్తుకు తెస్తున్నాయని, పేదల కోర్కెలపట్ల ప్రభుత్వం జాగు చేస్తూండటంవల్లే ఈ ఘోరం జరిగిందని నూజివీడు స్వతంత్రపార్టీ అధ్యక్షులు శ్రీ కలగర సత్యనారాయణగారు ఇటీవల ఒక ప్రకటనలో విమర్శించారు.

శ్రీ సత్యనారాయణగారు తమ ప్రకటనలో ఇలా తెలియజేశారు:

"కాంగ్రెసుప్రభుత్వ హయాములో బంజరు సాగుదార్లు వ్యవసాయ కూలీలు, నిరుపేదలు, తమ హక్కుభుక్తాలలోనున్న బంజరు భూమిని నిలుపుకోటానికి ప్రాణాలను సైతం బలి చేస్తున్నారనేది పరమసత్యమని గన్నవరం తాలూకా సూరంపల్లి సంఘటనే రుజువు పరుస్తున్నది. పేదలకుప్రభుత్వ రక్షణలేదని యీ ఉదంత మేచాటుతూ వుంది. దీన్నిబట్టి పేదవాళ్ల న్యాయమైన కోర్కెలపట్ల ప్రభుత్వం పక్షపాతం వహిస్తున్నట్లు తేలుతూంది. ప్రభుత్వం పేదవాళ్ల కోర్కెల విషయంలో కాలయాపన చేయకుండా వున్నట్లయితే, ఈ దారుణమైన, ఘోరమైన, భయంకరమైన దుర్ఘటన జరిగేది కాదు. నిండు ప్రాణాలనునిర్దాక్షిణ్యంగా బలిగొనడానికి సూరంపల్లి మొఖాసాదార్లకు అవకాశం చిక్కేదికాదు. ఈ ఘోరాతిఘోరమైన సూరంపల్లి మొఖాసాదార్ల నిర్దాక్షిణ్యచర్యలను వింటూవుంటే గుండె తరుక్కుపోకుండావుండే మానవుడెవడు? కాంగ్రెస్ ప్రభుత్వం పేదల న్యాయమైనకోర్కెల పట్ల నిర్లక్ష్యం వహించటం, జమీందారీ, మొఖాసాదారీ, భూస్వామ్యాలను బలపరచటమే కాగలదు.

నాటి బ్రిటిష్ ప్రభుత్వకాలంలో జరిగిన జలియన్‌వాలాబాగ్ కాల్పులను, ఘోరందురంతాలను యీ దుర్ఘటన జ్ఞప్తికి తెస్తున్నది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం పట్టుదలగా, న్యాయంగా వ్యవహరించక, బంజరు సాగుదార్లకు రక్షణ కల్పించకపోతే, యిటువంటి ఘోరాతిఘోరమైన కాల్పులకు మరికొన్నిచోట్ల మరికొందరు పాల్పడవచ్చు. అందువల్ల సాగుదార్లకు ప్రభుత్వం వెంటనే రక్షణ కల్పించవలసి వున్నది. స్వరాజ్యమొచ్చి 15 సంవత్సరాలయినప్పటికీ ఆహార కొరత తీరలేదు. బంజరుభూమిని సాగుచేస్తూ ఆహార పదార్థాలు పండిస్తున్న వారిని తుపాకీగుండ్లకు ఎరచేయడం క్షంతవ్యం కాదు. ఇది దేశాభ్యుత్తంగానున్న బంజరు సాగుదార్లకు కనువిప్పు కాగలదు. బంజరు సాగుదార్లపట్ల ప్రభుత్వం చూపుచున్న నిర్లక్ష్యవైఖరికి ఇది ఒక నిదర్శనం కూడాను.

నూజివీడుతాలూకా స్వతంత్రపార్టీ అధ్యక్షులుగాను, బంజరు సాగుదార్ల ఉపాధ్యక్షులుగాను, మృతవీరుల కుటుంబాలకు, బాధలకుగురైన సాగుదార్లకు నా సానుభూతిని అందచేస్తూ మృతవీరులకు నా జోహారులర్పిస్తున్నాను."

బజారు ధరలు

విజయవాడ, సెప్టెంబరు 15
(మధ్యాహ్నం గం. 1 వరకు)

బంగారం	
మేలిమి పాట్లా	145 4 0
మూగ	144 12 0
నవరసు	98 4 0
వెండి: 100 తులములు	285 0 0
1 తులము	2 6 0
ధాన్యం (కొత్తవి)	
24 నెంబరు	88 0 0
సంకరసన్నాలు	81 0 0
అక్కుళ్లు	28 8 0
కుసుమ	,,
బియ్యం (కొత్తవి)	
24 నెంబరు	78 0 0
సంకరసన్నాలు	71 0 0
అక్కుళ్ళు	65/- 66 0 0
కుసుమ	,,
ఇతరాలు	
మినుములు (100 కి)	52 0 0
కందులు (100 కి)	80/- 84 0 0
నల్లసెనగలు [మూగాకీ]	48/- 46 0 0
సెనగలు(పంజాబ్)92కి.	40 0 0
ధనియాలు లోకల్ కొత్త(40కి)	28/- 81/-
ఉలవలు (100 కి,	85-0-0 41 0 0
ఆముదాలు (75 కి)	54 0 0
పంచదార(ఉయ్యూరు)	116 4 6
కొబ్బరినూనెడబ్బా1½ మ.	40 8 0
వెల్లుల్లి 10 కి.	7 12 0
బెల్లం 11.20 కి.	8 0 0 6 0 0
మిర్చి 10 కి(కొత్త)	12/- 18 0 0
చీరాల్లి ,,	8 4 0 4 4 0
చింతపండు(10కి)	6 0 0 9 0 0
నువ్వులనూనె ,, మ.	38 8 0
వేరుశనగపప్పు కొత్తది	88 8 0
వేరుశనగపప్పు పాతది	78 8 0
వేరుశనగపప్పునూనె[illegible]	38 8 0
[illegible] 160 కాసులు	26 12 0
కొబ్బరికాయలు 1000	228 0 0
సంచులు 100	187 8 0
డిటో ఫార్వర్డు	125 0 0
తవుడు 2వ పట్టు	12 0 0
తవుడు 3వ పట్టు	14 0 0

తిరువనంతపురం ప్యాసింజరు పట్టాలు తప్పిన వైనం

మద్రాసు, సెప్టెంబరు 15

తిరువనంతపురంనుంచి మద్రాసు వస్తున్న ఫాస్టు ప్యాసింజరు ఇంజను, మూడు పెట్టెలు అగరుమురి - కార్కులై స్టేషన్ల మధ్య నిన్న సాయంకాలం పట్టాలు తప్పాయి. ఇంజను వెనుకనే వున్న తపాలా వ్యాను ఒక్కటిమాత్రం బోల్తాపడింది. ఎవ్వరికీ దెబ్బలు తగిలినట్లు లేదు.

'అర్థ'వైద్యులు

డాక్టర్ల కొరతనుతీర్చడానికి మద్రాసు ప్రభుత్వ ప్రణాళిక

మద్రాసు, సెప్టెంబరు 14

రాష్ట్రంలో వైద్యుల కొరతను తీర్చడానికి మద్రాసు ప్రభుత్వం త్వరలో "అర్థ వైద్యులను" తయారుచేస్తుందని ఆరోగ్యమంత్రి శ్రీ మాణిక్యవేలు నాయకర్ నేడిక్కడ అన్నారు.

కాంపౌండర్‌కంటే అధికులుగానూ, అన్ని అర్హతలు కలిగిన డాక్టర్లకంటే తక్కువ వారుగానూ అర్థవైద్యులు ఉంటారని ఆయన వర్ణించారు. హైద్రాబాదులో జరిగిన ఆరోగ్య మంత్రుల సమావేశం ఈ పద్ధతిని నిర్ణయించిందనీ, ఆచరణలో పెట్టమనిఅన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించిందనీ చెప్పారు.

కొంత మౌలిక పరిజ్ఞానం కలిగిన స్త్రీ, పురుషులకు 1½ సంవత్సరాలు శిక్షణనిస్తే, కొన్ని సామాన్య రోగాలకు చికిత్సచేయగల సామర్థ్యం ఈ "అర్థవైద్యుల"కు వస్తుందని ఆయన వివరించారు.

ఆరోగ్యమంత్రుల సమావేశం చేసిన ఈ ప్రతిపాదనను పశ్చిమ బెంగాల్, మైసూరురాష్ట్రాలు వ్యతిరేకించాయని చెప్పారు. తమ అవసరాలకు తగినంత మంది వైద్యులున్నారని పశ్చిమ బెంగాల్ వారు చెప్పారనీ పెద్దసంఖ్యలో యల్. యం. పి. డాక్టర్లు తమకు ఉన్నారని మైసూరువారు చెప్పారనీ శ్రీ మాణిక్యవేలు నాయకర్ అన్నారు.

మాస్కో కు సోకర్నో దూత

విదేశాంగమంత్రి ప్రయాణం

న్యూయార్క్, సెప్టెంబరు 15

శాంతికి సంబంధించిన ఉమ్మడి ప్రయోజనాల విషయమై క్రుశ్చేవ్‌తో వ్యక్తిగత సంభాషణలు జరిపే నిమిత్తం తాను ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుబాండ్రియోను మాస్కోకు పంపుతున్నానని ఇండోనేషియా అధ్యక్షుడు సోకర్నో నేడొక పత్రికా గోష్ఠిలో ప్రకటించారు. [illegible]

సోకర్నో అంతకుముందు విరామంలో అమెరికా ప్రతినిధియైన స్టీవెన్సన్‌తో 75 నిమిషాలసేపు సంభాషించారు.

ఇండోనేషియా అధ్యక్షుని హోదాలోనే సుబాండ్రియోను మాస్కోకు పంపుతున్నానుగాని బెల్గ్రేడ్ మహాసభ దౌత్యవ్యవహర్తగా పంపడంలేదని సోకర్నో అన్నారు.

సుబాండ్రియో నేటి రాత్రిగాని, రేపుగాని మాస్కో వెళ్తారని సోకర్నో చెప్పారు.

కెన్నెడీతో సంభాషణ

సోకర్నో నేటి సాయంత్రంఅధ్యక్షు కార్యాలయంలో కెన్నెడీతో రెండో దఫాచర్చలు జరిపారు. అంతకుముందు కెన్నెడీ మాలీ అధ్యక్షుడు కైటాతో కూడా సంభాషించారు.

ఇండోనేషియా సందర్శించ వలసిందిగా సోకర్నో ఆహ్వానించగా కెన్నెడీ అందుకు అంగీకరించారు. కెన్నెడీ ఎప్పుడు వెళ్ళేదీ యింకా తేదీ నిర్ణయం కాలేదు.

కైటా ప్రకటన

అధ్యక్షుడు కెన్నెడీతో రెండోదఫా సమావేశమైన తరువాత మాలీ అధ్యక్షుడు కైటా ఒక ప్రకటన చేస్తూ, కెన్నెడీ తనకూ సోకర్నోకూ ఒక లిఖితపూర్వక పత్రాన్ని అందించారని చెప్పారు. అందులో కెన్నెడీ, ఉత్తరోత్తరా ఆశాభంగం కలుగకుండా వుండేందుకై శిఖరాగ్రచర్చలకు ముందు మంత్రుల స్థాయిలో సంభాషణలు జరగాలని సూచించారని కైటా అన్నారు.

ఈ అభిప్రాయం సరైనదేనని తాను భావిస్తున్నాననికూడా కైటా అన్నారు. తానూ, సోకర్నో వాషింగ్టన్ వచ్చింది, శిఖరాగ్ర చర్చలుజరపాలని కోరడానికి గాదనీ, కొన్ని సంభాషణలతో సంప్రతింపులు ప్రారంభం కావాలని, అట్టి సంప్రతింపులలో నిర్దిష్టమైన పరిష్కార మార్గాలు కనుగొన వచ్చునన్న దే తమ వాంఛయనీ అన్నారు

బెర్లిన్ పరిస్థితిపై విదేశాంగశాఖ ప్రకటన

బెర్లిన్, జర్మనీ సమస్యలపై సంప్రతింపులు సాగాలన్న విషయమై సాధారణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా విదేశాంగశాఖ ప్రకటించింది. పై సమస్యలపై అమెరికా విదేశాంగమంత్రితో చర్చలకు సోవియట్ విదేశాంగమంత్రి సిద్ధమేనన్న మాస్కో ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ విదేశాంగ శాఖ పైవిధంగా వ్యాఖ్యానించింది. ఈ సంప్రతింపులు ఎప్పుడు ఎక్కడ ఎందుకు జరగాలన్న విషయమై చర్చలు సాగుతాయన్నారు.

తమిళనాడులో కిసాన్ సభచే సత్యాగ్రహం ప్రారంభం

గరిష్ఠపరిమితి బిల్లును సవరించాలని ఆందోళన; కోయంబత్తూరులో 18 మంది అరెస్టు

కోయంబత్తూరు, సెప్టెంబరు 15

లోపభూయిష్టమైన ప్రభుత్వ భూగరిష్ఠ పరిమితి బిల్లుకు వ్యతిరేకంగా తమిళనాడు కిసాన్ సభ నేడు సత్యాగ్రహం ప్రారంభించింది. ఈ సందర్భంలో నేడు కోయంబత్తూరులో 18 మంది వలంటీర్లు అరెస్టయ్యారు.

ఈరోడ్, అవినాషి, సత్యమంగలం, ఉడమల్ పేట తాలూకాలలోకూడ ప్రదర్శనలు, సత్యాగ్రహం జరిపినట్లు ఇక్కడకు వార్తలందాయి.

జిల్లా కిసాన్ సభ కార్యదర్శి శ్రీ యల్. అప్పు నాయకత్వాన ఊరేగింపుగా నినాదాలు చేస్తూ వాలంటీర్లు కోయంబత్తూరు కలెక్టరు కార్యాలయానికి వచ్చారు. భూగరిష్ఠ పరిమితిబిల్లులోని లోపాలను గూర్చి కలెక్టరుకు నివేదించడానికి అనుమతిని వారుకోరారు. కాగా పోలీసులు వారిని ఒక వ్యానులోకి ఎక్కించి ఎక్కడికో తెలియనిచోటుకు తీసుకు పోయారు.

బిల్లులో క్రింది సవరణలను చేయాలని కిసాన్‌సభ కోరుతున్నది. గరిష్ఠ పరిమితిని 30 ప్రమాణిక ఎకరాల నుండి 15 ప్రమాణిక ఎకరాలకు తగ్గించాలి. కౌల్దారును తొలగించరాదు. దేవాలయాలకు, మఠాలకు గరిష్ఠపరిమితి విషయములో మినహాయింపు ఉండరాదు. బిల్లును 1955 నుంచి అమలులో పెట్టి బినామీ ట్రాన్సుఫర్లను రద్దుచేయాలి.

మైసూరుఅసెంబ్లీనుంచి ప్రతిపక్షం వాకౌట్

గరిష్ఠ పరిమితి భూస్వాముల కనుకూలంగా నిర్ణయించినందుకు నిరసన

బెంగుళూరు, సెప్టెంబరు 14

మైసూరు భూగరిష్ఠపరిమితి బిల్లులో గరిష్ఠపరిమితి నిర్ణయం స్వార్థపరవర్గాలకు అనుకూలంగా ఉన్నందుకు నిరసనగా నేడు శాసనసభనుంచి పి. ఎస్. పి., తదితర ప్రతిపక్షసభ్యులు వాకౌట్ జరిపారు.

గరిష్ఠపరిమితి ప్రస్తుతం ఉన్న కమతాలకు 27 స్టాండర్డుఎకరాలుగానిర్ణయించబడింది. భవిష్యత్తులో సంపాదించే కమతాలకు ఇంకొక విధంగా గరిష్ఠ పరిమితి నిర్ణయించబడింది. ఈవిధంగా రెండు ప్రమాణాలను ఏర్పరచినందుకు ప్రతిపక్షసభ్యులు ప్రభుత్వాన్ని విమర్శించారు.

కొత్తియూరు రైతు యాత్రా దళం

కాంగ్రెసు ఎత్తుగడలపై కేరళ కమ్యూనిస్టుపార్టీ ఖండన

తిరువనంతపురం, సెప్టెంబరు 14

కొత్తియూరు రైతు యాత్రాదళం నాయకులు కాంగ్రెసు నాయకత్వం తెస్తున్న ఒత్తిడిలొంగి రైతుల ప్రయోజనాలను ఉపేక్షించరనే ఆశాభావాన్ని కేరళ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి వర్గం నేడొక ప్రకటనలో వ్యక్తంచేసింది.

మలబారులోని కొత్తియూరు ప్రాంతంలో దేవాలయాల భూములు దీర్ఘకాలికౌలుపై సాయుర సేవా సంఘానికి యివ్వబడ్డాయి. ఆ భూములను వందలాది రైతులు సాగుచేస్తున్నారు. ఆ భూములనుంచి రైతులను బేదఖలు చేయడానికి ప్రయత్నం జరుగుతోంది. ఇందుకు నిరసనగా కమ్యూనిస్టు వ్యతిరేక సంఘటన నాయకుడు ఫాదర్ వడక్కన్ తదితరుల 'అధ్వర్యంలో ఒక రైతుయాత్రాదళం ఇప్పుడు తిరువనంతపురం వెడుతూవుంది.

కమ్యూనిస్టులు మతద్వేషాన్ని రెచ్చగొట్టడానికి రైతుల ఆందోళనను బలపరుస్తున్నారని ఆరోపిస్తూ ఫాదర్ వడక్కన్ వంటి మతావలంబకుడు కమ్యూనిస్టులతో చేతులు కలపడం విచారకరమని కేరళ ప్రదేశ్ కాంగ్రెసు కార్యవర్గం, శాసనసభ కాంగ్రెసు పార్టీ కార్యవర్గం ఒక తీర్మానాన్ని చేశాయి. రైతు యాత్రను విరమించు కోవాలని విజ్ఞప్తిని చేశాయి.

కేరళ కమ్యూనిస్టు కార్యదర్శి వర్గం తన ప్రకటనలో కాంగ్రెసు తీర్మానాన్ని ఖండించింది. మత విద్వేషాన్ని సృష్టించే విధంగా కమ్యూనిస్టు నాయకులు ప్రకటనలుకాని, ప్రసంగాలుగాని చేశారేమో చూపించ వలసిందిగా కాంగ్రెసు నాయకత్వాన్ని కార్యదర్శి వర్గం సవాలు చేసింది.

కొత్తియూరు సమస్యలో రైతుల హక్కులుఇమిడిఉన్నాయని, మతంతో దీనికి సంబంధంలేదని కార్యదర్శివర్గం స్పష్టంచేసింది. వ్యవసాయిక రంగంలో దళారీలను రద్దుచేయాలనే సూత్రం గుర్తించబడిందని, దానిని వర్తింప చేయడమే కొత్తియూరు సమస్యా పరిష్కారానికి మూలమని కార్యదర్శి వర్గం ప్రకటనలో పేర్కొన్నది.

కేరళ కాంగ్రెసు కార్యదర్శి శ్రీ స్టీఫెన్ నిన్న రైతుయాత్రాదళం నాయకులు ఫాదర్ వడక్కన్ మున్నగు వారిని కలుసుకొని కాంగ్రెసుసంఘాలు చేసిన తీర్మానాన్ని అందజేశారు. రైతుయాత్రను విరమించుకోవాలని కోరారు.

అణు విజ్ఞానశాస్త్ర అధ్యయన సంస్థ

శ్రీ కృష్ణమీనన్ శంకుస్థాపన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 14

నవీనాభివృద్ధి రంగంలో వెలుగు బాటగా ఉండేందుకు అణు విజ్ఞాన పరిశోధన అవసరమని రక్షణశాఖా మంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడిక్కడ అణువైద్యం తదితర శాస్త్రాల సంస్థ భవనానికి శంకుస్థాపన జరుపుతూ అన్నారు. "ఈసంస్థ ఒక ఆస్పత్రికాదు. ఒక వైద్యకళాశాలాకాదు. అణుధార్మిక శక్తినుండి రక్షణ, అణుధూళి పడిన ఆహారపదార్థాలు వినియోగించినందువల్ల కలిగే చిక్కులు మొదలైనవేగాక, వైద్యశాస్త్రంలోవినియోగాల గురించి కూడా పరిశోధనలు జరుగుతాయన్నారు. పంటలకు పట్టే చీడలు మొదలైనవని నివారించుటకు అణుశాస్త్ర విజ్ఞానం తోడ్పడుతుందన్నారు.

నేడే విడుదల
మ్యాటినీతో ప్రారంభం
భీమవరం - గోవర్ధన
నెల్లూరు - న్యూటాకీ
ఏలూరు - పాండురంగ

బాలాజీ పిలింస్ సమర్పించు

యోధానయోధులు
(భారత స్వతంత్ర సమరగాథ)

సంగీతం: అశ్వత్థామ ★ డైరెక్షన్: కె. శంకర్

విజయవంతముగా ప్రదర్శింపబడుతోంది

విజయవాడ - శ్రీ మారుతిలో
గుంటూరు-హరిహరమహల్
తెనాలి - వెంకటేశ్వర
రాజమండ్రి - విజయటాకీస్
విశాఖపట్నం - రామకృష్ణ
అనకాపల్లి - జైహింద్

— భారత్ పిక్చర్స్

NVKR'S



Arvind
QUALITY FABRICS

•SANFORIZED•
REGISTERED TRADE MARK
of CLUETT PEABODY & CO INC USA

మెర్సెరైజ్డ్ సానఫొరైజ్డ్
తెల్ల పాప్లిన్ కోల్డ్రింక్

మెర్సెరైజ్డ్ సానఫొరైజ్డ్
కలర్డ్ పాప్లిన్ బ్లూ బర్డ్

మెర్సెరైజ్డ్ తెల్ల దోవతులు,
రాణీ స్పెషల్

మెర్సెరైజ్డ్ చీరలు
రాణా స్పెషల్, ప్లాటినం, కామరాజ్

బుట్టాస్
MK4A GU

అరవింద్ మిల్స్ లి., అహమ్మదాబాద్-2.

REGISTERED USER OF THE TRADE MARK 'SANFORIZED'

పరిశుభ్రంగాను, ఆరోగ్యంగాను, వుండండి...

ఆరోగ్యంకోసం, శరీర పరిశుభ్రతకోసం

నహాన్

అంటునిరోధక సబ్బుతో రోజూ స్నానం చేయండి

టాటా ఉత్పత్తి

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షుడు), కాట్రగడ్డ రాజగోపాలరావు, ఏటుకూరు బలరామమూర్తి, విశాలాంధ్రవిజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు, విజయవాడ-2